thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 41 | జగిత్యాల | శుక్రవారం | 01 మే, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

సొంత గడ్డపై గుజరాత్ విజయం



11

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 30:** విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్ మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు.

మిగతా 2 లో

"రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సకాలంలో మరియు నాణ్యతతో అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన మరియు ఎస్సీ సంక్షేమ శాఖల పరిధిలోని విద్యార్థులకు అందజేసే వస్తువుల కొనుగోలుపై ఆయన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో వివిధ శాఖలు విడివిడిగా ప్రొక్యూర్‌మెంట్ చేపట్టడం వల్ల అనేక అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకునేవని, వాటిని అరికట్టి పారదర్శకతను పెంచేందుకే 'సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్' విధానాన్ని తీసుకువచ్చామని సీఎం తెలిపారు."



## తెలంగాణ ప్రజలకు శుభవార్త

ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ

- మే 1 నుంచి జూలై 31 వరకు భారీ డిస్కౌంట్
- అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ వేగవంతమే లక్ష్యం
- జీఓ విడుదల చేసిన మున్సిపల్ శాఖ..
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన

2



## యువ పోలీసుల చేతుల్లోనే శాఖ ప్రతిష్ట

- వీడ్కోలు సన్మానంలో డీజీపీ శివధర్ రెడ్డి
- 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అత్యంత ఆవశ్యకం
- కొత్త డీజీపీ సీవీ ఆనంద్‌కు అభినందనలు

3

యువ పోలీస్ అధికారులు విభాగం ప్రతిష్టను పెంచాలని, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉండే 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానానికి పెద్దపీట వేయాలని శివధర్ రెడ్డి సూచించారు. ప్రస్తుత సమాజంలో పౌరులకు ఈ విధానం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. సమష్టి కృషి వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మరియు తన కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



2

## ప్రభుత్వ సలహాదారుగా వీహెచ్ నియామకం

రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ శివధర్‌రెడ్డి నియామకం

## శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

- కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాం
- మేడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్



.. వివరాలు 2లో

## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు



- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

2



## చట్టాలను మార్చండి

- 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు
- గర్భాన్ని తొలగించుకునేలా చట్ట సవరణ చేయాలని సూచన

4

అత్యాచార బాధితురాలైన 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీంకోర్టు గురువారం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది.

## మా కొత్త ఆయుధంతో అమెరికాకు హార్ట్‌ఎటాకే

- అతిత్వరలో రహస్య అస్త్రాన్ని ప్రయోగిస్తాం
- అణు ఒప్పందం కుదిరే వరకు దిగ్బంధనం
- ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్

4



## అర్హులందరికీ అక్రిడిటేషన్

- ప్రభుత్వానికి రెండో ఆలోచన లేదు
- నూతన జీవోలతో 46 వేల మందికి లబ్ధి
- 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి
- సంస్థలు మారినా కార్డులు తొలగించం
- జర్నలిస్టులకు కార్డులు అందజేసిన మంత్రి పొంగులేటి

2





## ఏసీబీ వలలో అవినీతి తిమింగలాలు

- ఇద్దరు అధికారులు అరెస్ట్
- ఆస్తి పన్ను తగ్గింపునకు లంచం డిమాండ్ చేసిన మున్సిపల్ ఉద్యోగి
- పోడు భూముల వ్యవహారంలో పట్టుబడ్డ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్
- సంగారెడ్డి, కొత్తగూడెం జిల్లాల్లో ఏసీబీ దాడులు

3

## గుజరాత్ పోలీసుల అదుపులో మురుగన్ గ్యాంగ్

- ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు
- ఏడాదిలోనే 25 మంది చిన్నారుల విక్రయం..
- దేశవ్యాప్తంగా నెట్‌వర్క్
- హైదరాబాద్‌కు చెందిన మురుగన్ కింగ్‌పిన్‌గా గుర్తింపు.. భార్యతో మరో ముఠా!
- తమకు సంబంధం లేదని నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ వివరణ

3






## 18 నెలల బాలుడికి లివర్ మార్పిడి

- ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర అభినందన

2

చురకలు





# తెలంగాణ ప్రజలకు శుభవార్త

## ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ

## మే 1 నుంచి జూలై 31 వరకు భారీ డిస్కౌంట్

**హైదరాబాద్, ఏప్రిల్30:** తెలంగాణ రాష్ట్రంలో అనుమతి లేని, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. పెండింగ్‌లో ఉన్న లక్షలాది దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా, ఎల్ఆర్ఎస్ ఫీజు మరియు ఇతర చార్జీలపై ఏకంగా 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ జీఓ ఎంఎస్ నెం. 131ని విడుదల చేసింది. ప్రభుత్వం ప్రకటించిన ఈ రాయితీ పథకం మే 1వ తేదీ నుంచి ప్రారంభమై జూలై 31 వరకు, అంటే కేవలం మూడు నెలల పాటు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ నిర్ణీత గడువులోగా తమ ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లించే దరఖాస్తుదారులకు మాత్రమే ఈ 25 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా నిలిచిపోయిన ఈ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో 'తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్‌అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్-2020'కి సవరణలు చేస్తూ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులను జారీ చేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అక్రమ లేఅవుట్ల సమస్యకు ఈ రాయితీ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు విశ్లేషిస్తున్నారు. తక్కువ ధరకే తమ భూములను చట్టబద్ధం చేసుకునే ఈ సువర్ణావకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# ప్రభుత్వ సలహాదారుగా వీహెచ్ నియామకం

## రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 30:** తెలంగాణ ప్రభుత్వం పరిపాలనలో కీలక మార్పులు చేస్తూ సలహాదారుల నియామకంపై కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు (వీహెచ్)ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవికి సంబంధించి ఆయనకు క్యాబినెట్ హోదాను కూడా కల్పించింది. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న వీహెచ్ సేవలను ప్రభుత్వ పరంగా వినియోగించుకోవాలని సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, రాష్ట్ర భద్రతా వ్యవహారాల కోసం ప్రత్యేకంగా భద్రతా సలహాదారును ప్రభుత్వం నియమించింది. ఇటీవలే డీజీపీగా పదవీ విరమణ చేసిన బత్తుల శివధర్‌రెడ్డిని రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. పోలీస్ విభాగంలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన అనుభవం, రాష్ట్ర భద్రతా వ్యూహాల రచనలో కీలకంగా మారనుంది. కీలకమైన ఈ రెండు నియామకాలతో రాష్ట్ర ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో మరింత వేగం పెరగనుంది.

# అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

## జర్నలిస్టులకు కార్డులు అందజేసిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఏప్రిల్30:** రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. గురువారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు స్వయంగా కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని, ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారినట్లయితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారి కార్డులను తొలగించబోమని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అక్రిడిటేషన్ల సంఖ్య కేవలం 32 వేల నుంచి 35 వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన నిబంధనల వల్ల సుమారు 46 వేల మంది జర్నలిస్టులకు లబ్ధి చేకూరుతుందని మంత్రి వివరించారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్డులకు సంబంధించి 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థాయి కార్డుల మంజూరుపై కూడా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రాబోయే 15 రోజుల్లో అర్హులందరికీ కార్డుల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన ప్రకటించారు. కొత్త దరఖాస్తుల స్వీకరణకు ఒక నిర్ణీత గడువు ఉండాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల ఖచ్చితమైన సంఖ్య తెలిస్తే, దాని ఆధారంగా వారి కోసం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాత కార్డుల గడువు ముగియడంతో, యుద్ధ ప్రాతిపదికన కొత్త కార్డుల జారీని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు.

# 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

## ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర అభినందన



**హైదరాబాద్, ఏప్రిల్ 30:** ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో అరుదైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. గ్లైకోజెన్ స్టోరేజ్ సమస్యతో బాధపడుతున్న 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఉస్మానియా వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. 10 కిలోల బరువున్న బాబుకి లివర్ మార్పిడి చేశారు. తండ్రి లివర్ నుంచి కొంత భాగాన్ని సేకరించి చిన్నారికి అమర్చారు. 14 గంటల పాటు క్లిష్ట శస్త్రచికిత్స కొనసాగింది. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగా డాక్టర్లు చికిత్స అందజేశారు. దేశంలో ప్రభుత్వ రంగంలో ఇలాంటి శస్త్రచికిత్సలు అత్యంత అరుదని డాక్టర్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉస్మానియా వైద్యుల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

మొదటి పేజీ తరువాయి

సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పె÷-టటెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని



పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

## కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాం

## మేడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 30 :** మే డే సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే




అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

# యువ పోలీసుల చేతుల్లోనే శాఖ ప్రతిష్ట

- వీడ్కోలు సన్మానంలో డీజీపీ శివధర్ రెడ్డి
- ప్రజలకు చేరువయ్యేలా 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అత్యంత ఆవశ్యకం
- కొత్త డీజీపీ సీవీ ఆనంద్‌కు అభినందనలు

**హైదరాబాద్, ఏప్రిల్30:** రాష్ట్ర డీజీపీ బీ శివధర్ రెడ్డికి తెలంగాణ పోలీస్ అకాడమీలో పోలీస్ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం ఆయన పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 32 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో మధురమైన అనుభూతులు, అనుభవాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. వృత్తిలో భాగంగా అనేక సంస్కరణలు ప్రవేశపెట్టామని, నేడు పోలీసింగ్ విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయని ఆయన అభిప్రాయపడ్డారు. యువ పోలీస్ అధికారులు విభాగం ప్రతిష్టను పెంచాలని, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉండే 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానానికి పెద్దపీట వేయాలని శివధర్ రెడ్డి సూచించారు. ప్రస్తుత సమాజంలో పౌరులకు ఈ విధానం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. సమష్టి కృషి వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మరియు తన కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనను డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ, తన గురువులను కూడా స్మరించుకున్నారు.



## కొత్త డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసలు

నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్న సీవీ ఆనంద్‌కు శివధర్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ, శివధర్ రెడ్డి తన సర్వీసులో ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారని ప్రశంసించారు. 1970, 1980 నాటి పరిస్థితులకు, ఇప్పటి పోలీసింగ్‌కు చాలా వ్యత్యాసం ఉందని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా శాఖను సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. శివధర్ రెడ్డి వంటి అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని సీవీ ఆనంద్ ఈ సందర్భంగా వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం



**హైదరాబాద్ /అమరావతి, ఏప్రిల్ 30:** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది.



అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది. ఇదిలావుంటే తెలుగు రాష్టాల్లో ఎండలు మండిపోతున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, విశాఖ, విజయవాడ, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణలో వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం మాత్రం అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఏపీలోనూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

# గుజరాత్ పోలీసుల అదుపులో మురుగన్ గ్యాంగ్




- ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు
- ఏడాదిలోనే 25 మంది చిన్నారుల విక్రయం..
- దేశవ్యాప్తంగా నెట్‌వర్క్
- హైదరాబాద్‌కు చెందిన మురుగన్ కింగ్‌పిన్‌గా గుర్తింపు.. భార్యదీ మరో ముఠా!
- తమకు సంబంధం లేదని నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ వివరణ

**హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిన్నారుల అక్రమ రవాణా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. చైల్డ్ ట్రాఫికింగ్‌లో కింగ్‌పిన్‌గా భావిస్తున్న మురుగన్ గ్యాంగ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ గ్యాంగ్ అందించిన సమాచారం మేరకు మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. గత ఏడాది వరకు ఆదిలాబాద్‌లోని ఇటుక బట్టీలో పనిచేసిన మురుగన్, కేవలం ఒక్క ఏడాది కాలంలోనే దేశవ్యాప్త నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని చైల్డ్ ట్రాఫికింగ్‌లో కింగ్‌పిన్‌గా ఎదగడం పోలీసులను విస్మయానికి గురిచేస్తోంది. మురుగన్ గత చరిత్రను పరిశీలిస్తే, గత ఏడాది చైతన్యపురి కేసులో ఇతని పేరు మొదటిసారి వెలుగులోకి వచ్చింది. మూడు నెలల పాటు జైలు శిక్ష అనుభవించి జూలైలో విడుదలైన తర్వాత, మురుగన్ తన కార్యకలాపాలను దేశవ్యాప్తంగా విస్తరించాడు. కేవలం ఒక్క ఏడాదిలోనే ఈ ముఠా సుమారు 25 మంది చిన్నారులను విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. మురుగన్ భార్య కృష్ణవేణి కూడా మరో ప్రత్యేక గ్యాంగ్‌ను నడుపుతున్నట్లు గుజరాత్ పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని గుజరాత్‌కు తరలిస్తున్నారు.

**నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ క్లారిటీ:**

ఈ కేసులో తమ సంస్థపై జరుగుతున్న ప్రచారంపై హైదరాబాద్‌లోని ప్రముఖ 'నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ' యాజమాన్యం స్పందించింది. మురుగన్ గ్యాంగ్‌కు తమకు ఎలాంటి సంబంధం లేదని, గుజరాత్ పోలీసులు తమ సెంటర్లలో ఎటువంటి తనిఖీలు నిర్వహించలేదని వారు స్పష్టం చేశారు. తాము అన్ని క్లినికల్, లీగల్ మరియు ఎథికల్ ప్రమాణాలకు అనుగుణంగానే సేవలు అందిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో తమపై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు వివరణ ఇచ్చారు.

# త్వరలో ట్రైబల్ వర్సిటి క్యాంపస్ నిర్మాణం

**రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు**

**ప్రధాని పర్యటనపై కిషన్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, ఏప్రిల్ 30:** సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్‌లో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వేస్టేషన్లను, కాజీపేట- విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

**భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్**

**అధికారులతో సమీక్షించిన డిప్యూటి సిఎం భట్టి**

**హైదరాబాద్, ఏప్రిల్ 30:** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

# చిన్నారిని మింగిన మిషన్ భగీరథ గుంత

**పూడ్చకుండా ఉంచడంతో గుంతలో పడ్డ ఐదేళ్ల మోక్షిత**

**అధికారుల తీరుపై గ్రామస్థుల ఆందోళన**



**జనగామ, ఏప్రిల్ 30:** జిల్లాలోని బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం ఒక పసి ప్రాణాన్ని బలితీసుకుంది. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మత్తుల కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో, ప్రమాదవశాత్తు అందులో పడి మోక్షిత అనే ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీక్ కావడంతో, సుమారు 20 రోజుల క్రితం అధికారులు మరమ్మత్తుల కోసం 4 మీటర్ల లోతున భారీ గుంతను తవ్వారు. అయితే, మరమ్మత్తులు పూర్తయినా లేదా మధ్యలో నిలిచిపోయినా, ఆ గుంతను పూడ్చకుండా అధికారులు అలాగే వదిలేశారు. గత మూడు వారాలుగా ఆ మృత్యు గుంత పాఠశాల ముందే దర్శనమిస్తున్నా, ఏ ఒక్క అధికారి కూడా దాని భద్రత గురించి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో కవిత అనే మహిళ ఆయాగా పనిచేస్తోంది. ఆమె తన ఇద్దరు కుమార్తెలు దక్షిత , మోక్షితలను వెంటబెట్టుకుని పాఠశాలకు వచ్చింది. తల్లి లోపలికి వెళ్లిన క్రమంలో, ఆడుకుంటూ వెళ్లిన మోక్షిత ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడిపోయింది. పక్కనే ఉన్న అక్క దక్షిత ఈ విషయాన్ని వెంటనే తల్లికి చెప్పడంతో, కవిత పరుగులు తీస్తూ వచ్చి తన చిన్నారిని కాపాడుకునేందుకు గుంతలోకి దూకింది. కవితతో పాటు దక్షిత కూడా గుంతలోకి దూకింది. గుంతలో మునిగిపోతున్న వారిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ముగ్గురినీ బయటకు తీశారు. అయితే, అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. తల్లి కవిత, అక్క దక్షిత ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఐదేళ్ల మోక్షిత అప్పటికే మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ తన కళ్లముందే విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మిషన్ భగీరథ అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే మోక్షిత ప్రాణాలు కోల్పోయిందని ఆగ్రహించిన బంధువులు, గ్రామస్తులు చిన్నారి మృతదేహంతో ఆందోళనకు దిగారు. స్కూల్ ఎదుటే అంత లోతైన గుంతను 20 రోజుల పాటు పూడ్చకుండా వదిలేయడం అధికారుల నేరపూరిత నిర్లక్ష్యమేనని వారు మండిపడుతున్నారు. తక్షణమే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో ఆలీంపూర్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.




# కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

**ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం**

**టీఆర్ఎస్ రాసిపెట్టి ఉందంటూ కవిత పోస్ట్**

**హైదరాబాద్, ఏప్రిల్ 30:** 'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణెళి ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

# ఏసీబీ వలలో అవినీతి తిమింగలాలు

**ఇద్దరు అధికారులు అరెస్ట్**

**ఆస్తి పన్ను తగ్గింపునకు లంచం డిమాండ్ చేసిన మున్సిపల్ ఉద్యోగి**

**పోడు భూముల వ్యవహారంలో పట్టుబడ్డ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్**

**సంగారెడ్డి, కొత్తగూడెం జిల్లాల్లో ఏసీబీ దాడులు**



**సంగారెడ్డి/భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 30:** రాష్ట్రంలో అవినీతి అధికారుల వేట కొనసాగుతోంది. వేర్వేరు జిల్లాల్లో లంచం తీసుకుంటూ మున్సిపల్ మరియు అటవీ శాఖకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి ఏసీబీకి చిక్కాడు. ఆస్తి పన్ను తగ్గించేందుకు బిల్లు కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న నిఖిల్ రెడ్డి అనే వ్యక్తి ఒక బాధితుడి నుంచి రూ. 35 వేలు డిమాండ్ చేశాడు. ఇందులో భాగంగా ఇప్పటికే రూ. 20 వేలు వసూలు చేయగా, మిగిలిన రూ. 15 వేల కోసం బాధితుడిపై ఒత్తిడి పెంచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ నేతృత్వంలో అధికారులు వ్యూహం పన్ని, గురువారం బాధితుడి నుంచి రూ. 15 వేలు తీసుకుంటుండగా నిఖిల్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో సుమారు 4 గంటల పాటు సోదాలు నిర్వహించిన అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరో ఘటనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నడిమిగూడెం బీట్ అధికారి బానోత్ నరేష్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. బాధితుడి తండ్రికి ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు జోక్యం చేసుకోవద్దని కోరగా, ఇందుకు ప్రతిగా బీట్ అధికారి లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా, గురువారం రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు అతడిని పట్టుకున్నారు. నిందితుడిని వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్లడించారు.

# పిల్లల దత్తతలో జాగ్రత్తలు తీసుకోవాలి



**హైదరాబాద్, ఏప్రిల్ 30 :** పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. దత్తత కావాలనుకున్న వారు ఐసీడీసీని సంప్రదించాలని సూచించారు. శుక్రవారం కాచిగూడ బస్ టెర్మినల్‌లో అమ్మఒడి తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పిల్లల దత్తత కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. సమ్మక్క – సారలమ్మ జాతరలో పిల్లల తల్లులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, జన సమూహ ప్రాంతాల్లో, బస్సు టెర్మినల్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక, శిశు, సంక్షేమ శాఖ అధికారులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చురకలు






సంపాదకీయం

# శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు!

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వడ్డాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# మా కొత్త ఆయుధంతో అమెరికాకు హార్ట్‌ఎటాకే

- అతిత్వరలో రహస్య అస్త్రాన్ని ప్రయోగిస్తాం
- అణు ఒప్పందం కుదిరే వరకు దిగ్బంధనం
- చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం
- ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్



**టెహ్రాన్:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ ముదురుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ అమెరికాను ఉద్దేశించి అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. శత్రు బలగాలపై త్వరలోనే ఒక సరికొత్త ఆయుధంతో విరుచుకుపడతామని, అది అమెరికాను తీవ్ర భయాం దోళనలకు గురిచేస్తుందని ఆయన హెచ్చరించారు. ఆ ఆయుధం శత్రువుల పక్కనే ఉందని, దాని ధాటికి వారికి గుండెపోటు వచ్చే అవకాశం కూడా ఉందని ఆయన వ్యాఖ్యానించడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. అయితే, ఆ రహస్య ఆయుధం ఏమిటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. హర్మూజ్ జలసంధి దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే చర్చలకు వస్తామన్న ఇరాన్ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చారు. అణు ఒప్పందం కుదిరే వరకు ఈ దిగ్బంధనం కొనసాగుతుందని, ఇందులో రాజీపడే ప్రసక్తే లేదని ట్రంప్ స్పష్టం చేశారు. సైనిక చర్య కంటే ఓడరేవుల దిగ్బంధనమే ప్రభావవంతంగా పనిచేస్తోందని, దీనివల్ల టెహ్రాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్ తీవ్ర ఒత్తిడిలో ఉందని, రానున్న రోజుల్లో ఆ దేశ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ట్రంప్ హెచ్చరించారు. మరోవైపు, అమెరికా వ్యూహాలను ఇరాన్ కమాండర్ షారమ్ ఇరానీ కొట్టిపారేశారు. గతంలో అమెరికాకు చెందిన విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ అబ్రహాం లింకన్'పై తమ దళాలు ఏడు క్షిపణులతో దాడి చేశాయని, దానివల్ల ఆ నౌక కార్యకలాపాలకు ఆటంకం కలిగిందని ఆయన గుర్తు చేశారు. అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ తమ ఓడరేవుల నుంచి నౌకలు గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయని ఆయన వెల్లడించారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ ప్రజల కోసం చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి ప్రతీకారం తీర్చుకుంటామని, శత్రువులు పశ్చాత్తాపం చెందేవరకు వారిని దెబ్బకొడుతూనే ఉంటామని ఆయన ప్రతిజ్ఞ చేశారు.

# మీ చట్టాలను మార్చండి

- 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు
- గర్భాన్ని తొలగించుకునేలా చట్ట సవరణ చేయాలని కేంద్రానికి సూచన
- నిర్ణయాన్ని బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులకే వదిలేసిన అత్యున్నత న్యాయస్థానం



**న్యూఢిల్లీ:** అత్యాచార బాధితురాలైన 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీంకోర్టు గురువారం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. 30 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు బాలికకు గతంలోనే అనుమతినిచ్చిన కోర్టు, దీనిపై ఎయిమ్స్ దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ దశలో గర్భవిచ్ఛిత్తి చేస్తే బాలిక ఆరోగ్యంపై దీర్ఘకాలికంగా తీవ్ర ప్రభావం పడుతుందని, డెలివరీకి ఇంకా నాలుగు వారాలే సమయం ఉన్నందున బిడ్డకు జన్మనిచ్చి దత్తతకు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఎయిమ్స్ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ కోర్టుకు వివరించారు. అయితే, ఈ వాదనలపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ మానవీయ కోణంలో పలు సూచనలు చేసింది. ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలని ఒక మహిళను, ముఖ్యంగా అత్యాచారానికి గురైన మైనర్ బాలికను బలవంతం చేయలేమని కోర్టు స్పష్టం చేసింది. ఆ ఘటన తాలూకు క్షోభ బాధితురాలిని జీవితాంతం వెంటాడుతుందని, ఆమె పడే ఆవేదనను గుర్తించాలని పేర్కొంది. బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేనట్లయితే గర్భవిచ్ఛిత్తి నిర్వహించాలని, ఈ విషయంలో తుది నిర్ణయాన్ని బాధిత బాలిక మరియు ఆమె తల్లిదండ్రులకే వదిలేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సరైన కౌన్సెలింగ్ ఇచ్చి వారు నిర్ణయం తీసుకోవడంలో సహాయం చేయాలని సూచించింది. ఇదే సమయంలో అత్యాచార బాధితుల కోసం దేశంలోని చట్టాలను సవరించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అత్యాచార కేసుల్లో బాధితులు గర్భం దాల్చితే, ఏ సమయంలోనైనా దాన్ని తొలగించుకునేలా మార్పులు తీసుకురావాలని పేర్కొంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం 20 వారాలు దాటిన తర్వాత గర్భవిచ్ఛిత్తికి ఉన్న పరిమితులను సవరించి, అత్యాచార బాధితులకు అవాంఛిత గర్భాన్ని తొలగించుకునే వెసులుబాటు కల్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# అమెరికాకు హ్యాండిచ్చిన పాక్

- ఇరాన్‌కు రహస్యంగా చేదోడు!
- పాక్ మీదుగా ఇరాన్ సరకు రవాణా
- విశ్వసనీయత కోల్పోతున్న పాకిస్థాన్..



**ఇస్లామాబాద్ :** అమెరికా, ఇరాన్‌ల మధ్య రాజీ కుదురుస్తామని ప్రపంచ వేదికలపై చెప్పుకుంటున్న పాకిస్థాన్, తెరవెనుక అమెరికా ప్రయోజనాలకు గండి కొడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అమెరికా విధించిన కఠినమైన దిగ్బంధనంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఇరాన్‌ను గట్టెక్కించేందుకు పాకిస్థాన్ అండగా నిలిచిందని పలువురు విశ్లేషకులు రుజువులతో సహా విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో అమెరికా జాతీయ భద్రతా వ్యవహారాల నిపుణుడు డెరెక్ జె గ్రాస్‌మన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారాయి. అమెరికా ఆంక్షల కారణంగా సముద్ర మార్గంలో ముడి చమురు మరియు ఇతర సరకులను ఎగుమతి చేయలేక ఇరాన్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ఈ సమస్యను అధిగమించడానికి పాకిస్థాన్ తన భూభాగం మీదుగా ఇరాన్ కంటెయినర్లను తరలించేందుకు అనుమతించిందని గ్రాస్‌మన్ ఆరోపించారు. ఇందుకోసం పాక్‌లోని ఆరు కీలక రహదారులను ఇరాన్ రవాణాకు కేటాయిస్తూ అక్కడి ప్రభుత్వం అధికారికంగా ప్రకటన విడుదల చేయడం గమనార్హం. ఈ పరిణామం ద్వారా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యూహాలకు గండి పడిందని గ్రాస్‌మన్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా హెచ్చరించారు. పాక్ కేటాయించిన ఈ ఆరు రహదారుల ద్వారా ఇరాన్ తన సరకులను రష్యాతో పాటు ఇతర దేశాలకు సులభంగా తరలించుకునే అవకాశం చిక్కిందని, తద్వారా అమెరికా ఒత్తిడిని తట్టుకుని నిలబడగలుగుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే ఈ చర్చల విషయంలో పాకిస్థాన్ తటస్థంగా ఉండే అవకాశం లేదని ఇజ్రాయెల్ అనుమానం వ్యక్తం చేసింది. పాక్‌ను ఏమాత్రం నమ్మలేమని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి కూడా వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ ద్వంద్వ వైఖరి అమెరికాకు ఆగ్రహం తెప్పించే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

# విజయం టీఎంసీదే..

## ఎగ్జిట్ పోల్స్‌పై మమతా బెనర్జీ నిప్పులు

## 226 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తుందని దీమా

## బీజేపీ కార్యాలయం నుంచే ఎగ్జిట్ పోల్



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఘన విజయం సాధించడం ఖాయమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ 226 కంటే ఎక్కువ స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆమె స్పష్టం చేశారు. 'మా-మాటి-మానుష్' స్ఫూర్తితో టీఎంసీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి బెంగాల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొంటూ, ఆమె ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని రంగంలోకి దించినప్పటికీ, అంతిమ విజయం తమదేనని ఆమె తేల్చి చెప్పారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ గణాంకాలన్నీ బీజేపీ కార్యాలయం నుంచే విడుదలయ్యాయని ఆమె ఆరోపించారు. టీఎంసీ కార్యకర్తలు మరియు నాయకులలో భయాందోళనలు సృష్టించి, వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకే బీజేపీ ఇలాంటి తప్పుడు సంఖ్యలను ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. రెండో దశ ఎన్నికల సమయంలో తన నియోజకవర్గమైన భవానీపూర్‌లో రాత్రంతా దాడులు జరిగాయని ఆరోపించిన మమతా, ఓట్ల లెక్కింపు రోజున పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. బుధవారం సాయంత్రం బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే విడుదలైన మెజారిటీ ఎగ్జిట్ పోల్స్, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో స్పందించిన మమతా బెనర్జీ, ఈ అంచనాలన్నీ కుట్రపూరితమైనవని కొట్టిపారేశారు. రాష్ట్ర ప్రజలంతా ఐక్యంగా ఉండి లెక్కింపు ప్రక్రియను నిశితంగా గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఫలితాలు తమ పార్టీకి అనుకూలంగానే ఉంటాయని, మరోసారి టీఎంసీ అధికార పీఠాన్ని అధిరోహిస్తుందని ఆమె పునరుద్ఘాటించారు.

# సుదీర్ఘ యుద్ధానికి సిద్ధం

## రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు



**ఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా.. చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సామర్థ్యం లేక ఆపరేషన్ సిందూర్‌ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. 'ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ. ఇందులో మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకు వెళ్లాయి. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్‌ను ప్రారంభించి.. సరైన సమయంలోనే దాన్ని ముగించాం. ఇది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయం. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని పేర్కొన్నారు. దీనిపై పోరాటం కేవలం భద్రతకు సంబంధించిన విషయమే కాదని.. మానవత్వపు మౌలిక విలువలను పరిరక్షించేందుకని వ్యాఖ్యానించారు.

## పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజంకు కేంద్ర బిందువు..

ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని.. దానికి బహుముఖ కోణాలున్నాయన్నారు. దాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాక్ నిరంతరం ఉగ్రవాదానికి మద్దతిస్తోందని మండిపడ్డారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే.. పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజానికి కేంద్ర బిందువుగా మారిందంటూ ఎద్దేవా చేశారు.

## భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



**తాండూర్:** మండలంలో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అధికారులను ఆదేశించారు. గురువారం తాండూర్ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా కార్యాలయ రికార్డులను పరిశీలించారు. పెండింగ్లో ఉన్న భూ సంబంధిత దరఖాస్తులు, సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన రేఖ వైష్ణవికు సన్మానం




**గుడిహత్నూర్:** మండలంలోని సీతాగోంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని రేఖ వైష్ణవిని ఎంఈఓ రాథోడ్ ఉదర్రావు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో రేఖ వైష్ణవి 560 మార్కులు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా అద్భుత ఫలితాలు సాధించగలరని వైష్ణవి నిరూపించిందని కొనియాడారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులకు మార్కుల మెమోలు, బోనఫైడ్ సర్టిఫికెట్లు, బదిలీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగన్న, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్గా జగదీశ్వర్ గౌడ్



**ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన విభాగంలో ప్రభుత్వం కీలక బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా నిర్మల్ మున్సిపల్ కమిషనర్గా పనిచేస్తున్న ఎ.జగదీశ్వర్ గౌడ్ను ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ విడుదల చేసిన జీఓ నం.487 ప్రకారం ఈ నియామకం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా జగదీశ్వర్ గౌడ్ను తక్షణమే ఆదిలాబాద్ మున్సిపాలిటీలో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. గతంలో కూడా ఆదిలాబాద్ కమిషనర్గా పనిచేసిన సమయంలో పట్టణ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. ఇప్పుడు మళ్లీ జిల్లా కేంద్రానికి కమిషనర్గా రానుండటంతో పట్టణ సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. నియామక ఉత్తర్వులు వెలువడటంతో ఆయన త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.

## సేవాభావమే లక్ష్యం

- **కాంగ్రెస్ సేవాదళ్ శిక్షణ శిబిరంలో మంత్రి సీతక్క**

**హైదరాబాద్:** సేవాభావమే లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ నాంపల్లి మైదానంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సమర్థ శిక్షణ శిబిరంలో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ నాయకులతో కలిసి మహాత్మా గాంధీ జ్ఞాపకాలను స్మరించుకున్నారు. దేశ నిర్మాణంలో గాంధీజీ చూపిన మార్గం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. పార్టీ సేవాదళ్ కార్యకర్తలు క్రమశిక్షణ, సేవాభావంతో ప్రజలకు చేరువ కావాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లడంలో సేవాదళ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర నాయకులు, సేవాదళ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో ఏ పీ జే అబ్దుల్ కలాం స్కూల్ ప్రభంజనం






విజేతలకు ఘనంగా సన్మానం

**ఆసిఫాబాద్ టౌన్ :** పదో తరగతి ఫలితాల్లో ఆసిఫాబాద్ పట్టణంలోని ఏ పీ జే అబ్దుల్ కలాం స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభకనబరిచి సంచలనం సృష్టించారు. ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి, విద్యా సంస్థ గరిష్ఠ విజయాల పరంపరను కొనసాగించారు. విద్యార్థి సర్వము కృష్ణ (522) మార్కులతో పాఠశాల టాపర్గా నిలవగా, కుర్ర లక్ష్మీ ప్రసన్న (514) మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరితో పాటు వడ్లూరి అక్షయ్ (512) , సైమ ఆఫ్రీన్ (503), ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్లో పదవ తరగతిలో చదువుతున్న విద్యార్థులందరూ కూడా అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటారు. ఈ సందర్భంగా ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్ ఛైర్మెన్ అబ్దుల్ ఫయాజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఏ పీ జే అబ్దుల్ కలాం స్కూల్స్ అగ్రస్థానంలో నిలుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరంతర శ్రమ, ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణ వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం టాపర్లను శాలువాలతో సత్కరించి, వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అబుల్ హసన్, వైస్ ప్రిన్సిపాల్ రత్నం నాగరాజ్, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## మే 10 వరకు స్వీయ గణన చేసుకోవచ్చు

జిల్లా కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్ :**30 జనాభా గణన 2027 లో భాగంగా మొదటి విడత కార్యక్రమములో భాగంగా మే 10 వరకు తమ ఇంటి వివరాలను స్వీయ గణన ద్వారా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ హరిత అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో స్వీయ గణన , ఉపాది హామీ పథకం నఖిలి విత్తనాలు, మందులు,ఇందన కొరత, యాసంగి వరి ధాన్యము కొనుగోలు పై పత్రిక విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం.డెవిడ్ కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా, ఆసిఫాబాద్ ఏర డి ఓ లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన జనగణన – మన అభివృద్ధి లో భాగంగా కేంద్రం చేపడ్తున్న జనాభా గణన-2027 భాగంగా మొదటి విడత లో మే 11 నుండి జూన్ 9 వరకు ఇళ్ళ గణన చేపడుతున్నందున ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటింటికి సందర్శించి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేస్తారని కలెక్టర్ అన్నారు. ఈ కార్య క్రమములో భాగంగా ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన ద్వారా తమ ఇంటి వివరాలు, 33 అంశాల వివరాలను ఆల్ లైన్ లో నమోదు చేసుకోవచ్చన్నారు. తరువాత ఎన్యుమరేతారు ఇంటిని సందర్శించినపుడు నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తారని స్వీయ గణనను సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 994 మంది ఎయుమ రేటర్లు 174 మంది సూపర్ వైజర్లు , 1689 హౌస్ లిస్టింగ్ బ్లాక్ లుగా గుర్తించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పతాకంలో పని ప్రదేశాలలో కూలీలకు నీడ,త్రాగు నీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కూలీలు ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల వరకు పనిని పూర్తి చేసుకోవాలన్నారు. ఎండ తీవ్రత నుండి రక్షిం-చుకోవలన్నారు. జిల్లాలో పెట్రోల్, డిజిల్ కొరత లేదన్నారు. డిమాండ్ కు తగ్గట్టు సప్లయ్ ఉందన్నారు. అవసరమైన పుకార్లను నమ్మవద్దన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతులు జాగ్రత్తగా వుండాలన్నారు. నఖిలి పత్తి విత్తనాలు , మందులు కొనుగోలు చేయకూడదన్నారు. అనుమతి లేని విత్తానాలు, మందులు కొనుగోలు చేసిన, విక్రయించిన వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తానాలు మందులు కొనుగోలు చేసేటప్పుడు ఆన్ లైన్ రశీదులు తీసుకోవాలన్నారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు అవసరమైన మందులు కొనుగోలు ఒత్తిడి చేయకూడదన్నారు. యాసంగి వరి ధాన్యము కొనుగోలు పై పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రతి కొనుగోలు కేంద్రంలో త్రాగు నీరు, నీడా , వెలుతురూ, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎ గ్రేడ్ ధాన్యానికి 3389 సాదారణ రకం ధాన్యానికి 2369 మద్దతు ధర వుందని, సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల బోనస్ వుందని కొనుగోలు , రైస్ మిల్లులకు తరలింపు పూర్తిగా డిజిటల్ యాప్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.స్వీయ గణన ఇళ్ళ గణన కార్యక్రమము విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కారు సహకరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి వాసుదేవా రెడ్డి , వ్యవసాయ శాఖ అధికారి వెంకటి, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి సంపత్ కుమార్, సంబందిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో మెరిసిన గిరిజన ఆణిముత్యాలు

- **విద్యార్థులను సన్మానించిన జిల్లా కలెక్టర్ , ఎమ్మెల్యే**



**ఆసిఫాబాద్:** పదవ తరగతి ఫలితాల్లో కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు 98 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, 13 పాఠశాలలు నూరు శాతం ఫలితాలు సాధించారు. జైనూర్ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు అత్యున్నత ప్రతిభను చాటారు. ఈ నేపథ్యంలో, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లి దండ్రులను, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మి తన నివాసంలో శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కే. హరిత విద్యార్థులను సన్మానిస్తూ, ఇదే స్ఫూర్తితో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్. రమాదేవి, పీఎంఆర్సీ ఏసీఎంఓ పూర్కా ఉద్దవ్, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, ఏటీడీఓలు చిరంజీవి, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఆత్రం పార్వతి, జి. అశోక్, కోడెం రవీందర్, ఎస్సీఆర్పీలు కూడ్మేత అనంత్, రాథోడ్ రవీందర్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఆడే గజేందర్



**సొనాల:** మండలంలోని సాకేర గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. గ్రామానికి చెందిన రాథోడ్ రామారావు కుమార్తె వివాహ వేడుక గురువారం స్వగ్రామంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆడే గజేందర్ నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు చట్ల ఉమేష్, మహేందర్, యువజన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, సద్దాం, అచ్యుతానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి–విజయవాడ బస్సు చార్జీల తగ్గింపు



**సత్తుపల్లి:** సత్తుపల్లి నుంచి విజయవాడకు నడిచే ఎక్స్ప్రెస్ బస్సుల చార్జీలను తగ్గించినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సెక్టార్లో నడిచే ఎక్స్ప్రెస్ బస్సులకు విసన్నపేట నుంచి విజయవాడ వరకు 15 శాతం రాయితీ కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విసన్నపేట నుంచి విజయవాడకు ప్రయాణ చార్జీ గతంలో రూ.90 ఉండగా, ప్రస్తుతం రూ.80గా నిర్ణయించినట్లు తెలిపారు. సత్తుపల్లి నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికులు ఈ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ కట్టుబడి ఉందని తెలిపారు.

# నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్



**తాండూర్:** నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తాండూర్ సీఐ దేవయ్య అన్నారు. గురువారం తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అచలాపూర్ గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నివారణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని, ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. ప్రతి ఇంటి పరిసర ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేయవద్దని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అదేవిధంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించరాదని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచిం చారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, పోలీసులు ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అన్నారు. వేసవి కాలంలో విహార యాత్రలకు వెళ్లే వారు ఇంట్లో నగదు, నగలు ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పేర్కొన్నారు. యువత ఆన్లైన్ గేమ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్ర మంలో తాండూర్ ఎస్సై ప్రసాద్రావు, కన్నెపల్లి ఎస్సై భాస్కరరావు, మాదారం ఎస్సై సౌజన్య, భీమిని ఎస్సై కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యం ఇస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



**సత్తుపల్లి:** నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి, గంగదేవిపాడు, తుమ్మలపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. గంగదేవిపాడు గ్రామంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కాకా రామారావు కుమారుడు సాజిత్–సాయి శ్రావణి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే బన్నే వెంకటేశ్వరరావు కుమారుడు రమేష్–మౌనిక, బానోత్ కృష్ణ కుమారుడు వేణుగోపాల్–లక్ష్మీ మమత, కొర్ర శ్రీను–దేవి కుమారుడు నవీన్–పావని వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీస్సులు అందించారు. గంగదేవిపాడు గ్రామానికి చెందిన మాలోత్ కృష్ణ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం తుమ్మలపల్లి గ్రామంలో ఆంబోజి గోపి కుమార్తెలు శరణి, సలోని ఓనిల అలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, ఏఎంఎంసీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, గంగదేవిపాడు గ్రామ సర్పంచ్ రాధాకృష్ణ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పోట్లపల్లి వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్:** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేదలకు వరం లాంటిదని, వైద్య సహాయం అందించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్కు చెందిన నమాసాని నాగరాజు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా, ఆయన చేసిన దరఖాస్తు మేరకు సీఎం సహాయనిధి నుంచి రూ.1లక్ష 73వేల 950 మంజూరు కాగా, ఆ చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా చేసుకుని పనిచేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదల వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది పేదల ప్రాణాలు సీఎం సహాయనిధి ద్వారా నిలబడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ జన్ను శీభారాణి–అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బుద్దె పెద్దన్న, బిజిలి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం





**ములుగు:** ప్రజా ప్రభుత్వం పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తోందని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ అన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో గురువారం ములుగు మండలం పత్తిపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ రాజన్న నూతన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజలకు సొంత ఇంటి కల నెరవేర్చడం ప్రజా ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. మంత్రి సీతక్క కృషితో తమ సొంత ఇంటి కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధరావత్ సరిత సారయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు అర్షం రఘు, కార్యదర్శి విద్యాధర్ రెడ్డి, ములుగు పట్టణ యూత్ అధ్యక్షుడు అభినయ్ చారి, పోరిక రాజుకుమార్, యూత్ నాయకులు బండి రమేష్, ప్రభు, గూడెపు రాకేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి





**గంభీరావుపేట:** ప్రజలకు మేలు చేసే సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు అన్నారు. గంభీరావుపేట మండలం శ్రీగాధ గ్రామంలో గురువారం ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లబ్ధిదారులకు సారెచీరెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నచ్చే విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లను పూర్తిగా పారదర్శకంగా మంజూరు చేస్తున్నామని, అర్హులకే పథకాలు అందుతున్నాయని, పైరవీలకు అవకాశం లేదని తెలిపారు. సొంతింటి కలను నిజం చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని, రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో విడతలో మరో నాలుగు లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయని చెప్పారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, తెల్ల రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి ఎన్నికల హామీలను ఇప్పటికే అమలు చేసినట్లు తెలిపారు. త్వరలో కొత్త పెన్షన్లు కూడా లక్ష మందికి మంజూరు కానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు సుద్దాల అనిత–గణేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బందెల రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు వేముల శ్రీనివాస్ గౌడ్, నాయకులు పర్ష శ్రీనివాస్, గౌరినేని శ్రావణ్ రావు, వేముల యాదగౌడ్, కత్తుల బాబు, పర్ష నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని రేవతికి సన్మానం



**హన్మకొండ:** హన్మకొండ మనదర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బందెల రేవతి పదో తరగతి పరీక్షల్లో 528 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి సింగారపు రవి ప్రసాద్ గురువారం ఆమెను ఘనంగా సన్మానించారు. విద్యార్థిని సాధించిన విజయాన్ని కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, క్లాస్ టీచర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి సిరిమల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొక్కిరాల విశ్వప్రసాద్ మాతృమూర్తికి ఘన నివాళి



**ఆదిలాబాద్:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్ మాతృమూర్తి పెద్దకర్మ కార్యక్రమాన్ని గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విశ్వప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, ఆదిలాబాద్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బ్రిజ్ లాల్ కర్మన్కర్, జనరల్ సెక్రటరీ బానోత్ ప్రణీత సూరజ్ సింగ్, మాజీ ఎంపీటీసీ, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వర్, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం గాదిగూడ మండలంలోని పిప్రి (కొలంగూడ) గ్రామంలో ఆకస్మికంగా పర్యటించిన ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించి గ్రామంలో నిర్మాణంలో ఉన్న పలు ఇళ్లను స్వయంగా సందర్శించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదని, ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ లబ్ధిదారులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. బిల్లుల చెల్లింపుల్లో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, పనులు పూర్తయిన వెంటనే దశల వారీగా ఎంబీ రికార్డు చేసి నిధులు త్వరగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కాలనీల్లో గృహ నిర్మాణాలతో పాటు విద్యుత్, తాగునీరు, మురుగునీటి కాలువల వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అధికారులు, లబ్ధిదారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ఈ పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహశీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, హౌసింగ్, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చురకలు



# నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్:** ఈనెల 3న నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షను జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్ష విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉందని, ఏ చిన్న పొరపాటుకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, తగినంత వెలుతురు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ఏఎన్ఎంలు, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆరోగ్యశాఖకు సూచించారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, క్రమశిక్షణ విషయంలో రాజీ పడ కూడదని, కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను తప్పని సరిగా మూసివేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయం కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించే ప్రసక్తి లేదని, విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్. చిత్రు, రాజేశ్వర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, విద్య, వైద్యం, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# గిరిజన సంస్కృతిని కాపాడుకుందాం

- **అనాథ బిడ్డలకు అండగా నిలుద్దాం**
- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**ఆదిలాబాద్:** గిరిజన ఆర్థిక వ్యవస్థలో ఇప్ప పువ్వు కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం నార్నూర్ మండలం జామిడి గ్రామంలో నిర్వహించిన 9వ ఇప్ప పువ్వు పండుగ, అనాథ పిల్లల సంక్షేమ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్ప పువ్వును శాస్త్రీయ పద్ధతిలో సేకరించి విక్రయించడం ద్వారా గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఉత్సవాలు గిరిజన సంస్కృతిని భావితరాలకు అందిస్తాయని పేర్కొన్నారు. ఐటిడిఎ ద్వారా రైతులకు, స్వయం సహాయక సంఘాలకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "డీసీపీయూ సర్వే–చట్టబద్ధమైన దత్తత"అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని అనాథలు, వీధి బాలలను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా, కేవలం సీఏఆర్ఏ ద్వారా ఆన్లైన్లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనధికారిక దత్తత చట్టరీత్యా అని హెచ్చరించారు. పిల్లలకు కుటుంబ ప్రేమానురాగాలు అందించేందుకు ఫోస్టర్ కేర్ విధానాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా పిల్లల విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని అన్నారు. ఇబ్బందుల్లో ఉన్న పిల్లలు కనిపిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా "డిసిపియు సర్వే– చట్టబద్ధమైన దత్తత, ఫోస్టర్ కేర్"పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పీఓ మంద మకరంద్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# మున్సిపల్ పాలనపై పట్టు సాధించాలి

- **శిక్షణ తరగతుల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్**



**ఆదిలాబాద్:** మున్సిపల్ పాలనపై పట్టు సాధించాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వరంగల్ రీజియన్కు చెందిన మున్సిపల్ చైర్పర్సన్లు, మేయర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి, పాలనా సంస్కరణలే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా మున్సిపాలిటీలకు సంబంధించిన పరిపాలన, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్ వంటి కీలక విభాగాలపై చైర్పర్సన్లకు అవగాహన కల్పించారు. ట్రేడ్ లైసెన్సులు, వాటర్ ట్యాక్స్, ప్రాపర్టీ ట్యాక్స్, యూజర్ ఛార్జీల వసూళ్ల ద్వారా మున్సిపాలిటీ సొంత ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలో చర్చించారు. పట్టణాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల నాణ్యత, భవన అనుమతుల ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వీధిదీపాలు, పారిశుధ్యం, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచుతామని చెప్పారు. మహిళా చైర్పర్సన్లు, మేయర్లు ఎదుర్కొనే సవాళ్లపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారిణి శ్రీదేవి ప్రత్యేకంగా స్పందించారు. మున్సిపాలిటీల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా నేరుగా తమను సంప్రదించవచ్చని వివరించారు.

# భూసేకరణతో ప్రమాదంలో గ్రామాల భవిష్యత్తు

- **టీజీ ఐఐసీ, హెచ్ఎండీఏ భూసేకరణతో ఇబ్బందులు**
- **ఇందిరమ్మ, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపుల్లోనూ లోపాలు**
- **మంత్రి సమక్షంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆందోళన**

**సంగారెడ్డి:** గ్రామాల్లో కనీస సౌకర్యాలు, అవసరాల కోసం కూడా స్థలం లేకుండా మొత్తం భూములను స్వాధీనం చేసుకుంటే భవిష్యత్తులో తీవ్ర సమస్యలు తలెత్తుతాయని అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాప్రతినిధుల సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఆయన ఈ విషయాలను ప్రస్తావించారు. నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో టీజీ ఐఐసీ భూసేకరణపై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, శ్మశాన వాటికలు వంటి అవసరాలకు తగిన స్థలం కేటాయించకుండా భూములను తీసుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్ కింద హెచ్ఎండీఏ స్వాధీనం చేసుకున్న భూముల విషయంలో కూడా హామీలు అమలు కాలేదని విమర్శించారు. రైతులకు ఎకరానికి 600 గజాలు అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు అమలు కాలేదని, రైతుబంధు, రైతు బీమా వంటి లబ్ధులు కూడా అందడం లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో జాప్యం జరుగుతోందని, ఎమ్మెల్యే కోటా ప్రకారం ఇళ్ల మంజూరులో పారదర్శకత లోపిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు న్యాయంగా ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గతంలో మంజూరైన డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో అనేక ఇళ్లు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. వాటి నిర్మాణానికి నిధులు విడుదల చేసి త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. అక్రమంగా ఆక్రమించి నివసిస్తున్న వారిని తొలగించి నిజమైన అర్హులకు ఇళ్లు కేటాయించాలని కోరారు. సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామంలో భూస్వాధీనం సమస్యను ప్రస్తావిస్తూ, రైతులు జీవనాధారం కోల్పోతున్నారని చెప్పారు. గతంలో జరిగిన ఘటనలను గుర్తుచేస్తూ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక సంగారెడ్డి నియోజకవర్గం అలియాబాద్ గ్రామంలో భూములు వక్ఫ్ బోర్డు రికార్డుల్లో నమోదు కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల వద్ద చట్టబద్ధ పత్రాలు ఉన్నప్పటికీ సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ భూములను వక్ఫ్ రికార్డుల నుంచి తొలగించి సమస్యను త్వరగా పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



# అభివృద్ధి శిల్పులు కానీ హక్కులలో వెనుకబడిన వారు

ప్రతి సంవత్సరం మే 1న ప్రపంచవ్యాప్తంగా "కార్మిక దినోత్సవం"ను జరుపుకుంటారు. ఈ రోజు కార్మికుల శ్రమ, త్యాగాలు మరియు వారి హక్కులను వెలుగులోకి తేవడానికి ఉద్దేశించబడింది. అయితే వాస్తవంలో కార్మికుల హక్కుల గురించి మాట్లాడే సమయంలో చాలా మంది తమ స్వార్థ ప్రయోజనాలను ముందుకు పెట్టి న్యాయం చేయడంలో వెనుకబడుతారు అనే చేదు నిజం ఉంది। నేడు మనం చూస్తున్న అభివృద్ధి—ఎత్తైన భవనాలు, ఆధునిక రహదారులు, పరిశ్రమలు లేదా సాంకేతిక పురోగతి—ఇవన్నీ కార్మికుల చెమట, కష్టం ఫలితమే. ఫ్యాక్టరీల ఉత్పత్తి అయినా, కంపెనీల విజయాలైనా, ప్రతి చోట కార్మికుల కృషి ప్రధాన పాత్ర పోషిస్తుంది. కానీ విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ అభివృద్ధికి పునాది వేసిన కార్మికులే తమ ప్రాథమిక అవసరాలకు కూడా దూరంగా ఉంటున్నారు.ఇస్లాం కార్మికులకు గౌరవాన్ని మాత్రమే కాదు, వారి హక్కులను కూడా స్పష్టంగా నిర్దేశించింది. ప్రవక్త ముహమ్మద్ కార్మికులను "సోదరులు"గా సంబోధిస్తూ, వారితో మంచి ప్రవర్తన చేయాలని ఉపదేశించారు. ఒక హదీస్‌లో "కార్మికుడి చెమట ఎండకముందే అతని కూలీ ఇవ్వాలి" అని చెప్పబడింది, ఇది సమయానికి వేతనం చెల్లించే ప్రాముఖ్యతను తెలియజేస్తుంది।

**ఇస్లామిక్ బోధనల ప్రకారం కార్మికుల ముఖ్య హక్కులు ఇవి:**

మొదట, కూలీని సమయానికి మరియు పూర్తిగా చెల్లించాలి, తద్వారా దోపిడీ జరగకుండా ఉంటుంది.రెండవది, పని ప్రకారం సరైన వేతనం నిర్ణయించాలి; తక్కువ కూలీ ఇవ్వడం అన్యాయం.మూడవది, కార్మికుడి సామర్థ్యానికి మించి పని వేయకూడదు.నాలుగవది, గౌరవంతో మరియు మంచి ప్రవర్తనతో వ్యవహరించాలి.ఐదవది, పని ప్రారంభానికి ముందు కూలీ మరియు నిబంధనలను స్పష్టంగా నిర్ణయించాలి.ఇస్లాం హక్కుల గురించి మాత్రమే కాకుండా నైతిక బాధ్యతలను కూడా గుర్తుచేస్తుంది. మరో హదీస్ ప్రకారం, కార్మికునితో పూర్తిగా పని చేయించుకుని అతనికి కూలీ ఇవ్వని వ్యక్తి న్యాయదినాన కఠినంగా ప్రశ్నించబడతాడు. ఇది కార్మికుల హక్కుల ప్రాముఖ్యతను స్పష్టం చేస్తుంది.నేటి ప్రపంచంలో



**వ్యాసకర్త**
**ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్**
**ఉపాధ్యక్షుడు జమియతుల్ ఉలేమా**
**ఉమ్మడి కరీంనగర్ జిల్లా**



కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు—తక్కువ వేతనాలు, బలవంతపు శ్రమ, బాల కార్మికత్వం మరియు ప్రాథమిక హక్కుల లేమి. ప్రపంచ స్థాయిలో ఇది ఒక తీవ్రమైన సమస్యగా మారింది. చాలా మంది కార్మికులు యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం, ఆరోగ్య సదుపాయాలు పొందడం మరియు సురక్షితమైన పని వాతావరణం పొందడంలో వెనుకబడి ఉన్నారు. ఇది మన మనస్సాక్షికి ప్రశ్నగా నిలుస్తుంది.మరొక విషాదకరమైన విషయం ఏమిటంటే, కార్మికుల కష్టంతో పరిశ్రమల యజమానులు అపారమైన సంపద సంపాదిస్తారు, కానీ కార్మికులు మాత్రం పేదరికంలోనే జీవించాల్సి వస్తుంది. న్యాయం ఏమిటంటే, ఒక వ్యాపారాన్ని అభివృద్ధి చేసిన కార్మికుల హక్కులను పూర్తిగా కాపాడాలి.కార్మిక దినోత్సవం మనకు ఒక సందేశం ఇస్తుంది: ఇది కేవలం ఒక రోజు ఉత్సవంగా కాకుండా, కార్మికుల హక్కులను నిజంగా అమలు చేసే దిశగా అడుగులు వేయాలి. ఇస్లాం సూచించిన సమతుల్యమైన మరియు న్యాయమైన విధానం అమలు చేస్తే సమాజంలో శాంతి, సమానత్వం మరియు అభివృద్ధి సాధ్యమవుతుంది.చివరగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే, కార్మికులు కేవలం ఒక వర్గం కాదు—వారు సమాజానికి వెన్నెముక. వారి గౌరవం, వారి హక్కుల రక్షణ మరియు వారితో న్యాయం చేయడం ఒక సుసంస్కృత సమాజానికి గుర్తు. నిజమైన అభివృద్ధి కోరుకుంటే, కార్మికులకు వారి హక్కులను ఇవ్వాల్సిందే—అదే మన సమిష్టి విజయానికి మార్గం.నేడు మేడే ( ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వ్యాసం)

చురకలు



# అక్రమకట్టడాలకు కేరాఫ్ గా టీజిఐఐసి "ఐలా జీడిమెట్ల"

## "1986 లో" తీసుకున్న పర్మిషన్ లతో వెలుస్తున్న అక్రమ భారీషెడ్లు..?

- 40ఏళ్ల క్రితమే పర్మిషన్ తీసుకున్నారంటూ బుకాయిస్తున్న జీడిమెట్ల "ఐలా మేనేజర్"..
- ముందస్తు జాగ్రత్తతో షోకాజ్ నోటీసుల పేరిట "డ్రామా"..?
- "ఐలా"లో పర్మిషన్ పీరియడ్ 6ఏళ్లకే పరిమితం అనే నిబంధన తుంగలో తొక్కుతున్న అధికారులు ..
- "ఇల్లీగల్ షెడ్" నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి..




**సిటీబ్యూరో,హైదరాబాద్ :**

జీడిమెట్ల టిజిఐఐసి పారిశ్రామిక వాడలోని "ఐలా"లో అవినీతి రాజ్యమేలుతోంది..నిత్యం పారిశ్రామికవాడలో జరిగే అనుకోని విపత్తులు,అగ్నిప్రమాదాల వల్ల కార్మికుల ప్రాణాలు పోతున్న ఇక్కడి అధికారులు,సిబ్బందిలో చలనం శూన్యంగా మారింది.. ఇండస్ట్రియల్ లో వెలిసే కమర్షియల్ నిర్మాణాల్లో సరైన అనుమతులతో పర్మిషన్స్ ఇవ్వాల్సిన టిజిఐఐసి అధికారుల "ధనదహానికి" అడ్డు అదుపు లేకపోవడంతో అక్రమనిర్మాణాలు విచ్చల విడిగా కొనసాగుతున్నాయి..ఐలా అధికారులు,సిబ్బంది చేతివాటంతో జీడిమెట్ల పారిశ్రామికవాడలో అక్రమనిర్మాణాదారులు రెచ్చిపోతున్నారు.దీంతో ఇండస్ట్రీయల్ లోని కంపెనీల్లో పనిచేసే కార్మికులు,తమ కుటుంబాల జీవితాలు గాలిలో దీపంలా మారుతున్నాయి..జీడిమెట్ల పారిశ్రామికవాడలో వెలిసే అన్ని నిర్మాణాలకు "ఐలా నిబంధనలతో కూడిన పర్మిషన్" లు తప్పనిసరి. ఇండస్ట్రియల్ లో వెలిసే ప్రతి కమర్షియల్ నిర్మాణాల్లో సరైన సెట్ బ్యాక్ లతో పాటు ఫైర్ సేఫ్టీ అండ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీలతోనే నిర్మాణాలు చేపట్టాలి.రానున్న కాలంలో అనుకోని ప్రమాదాలు ఏమైన సంభవించినప్పుడు అందులో పనిచేసే కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు వీలుగా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి..కానీ జీడిమెట్ల ఐలా పరిధిలో మాత్రం పరిస్థితులు పూర్తిగా విభిన్నం..ఏళ్ల కాలంగా లేని పర్మిషన్స్ అయిన,ఐలా లో పర్మిషన్ కోసం అప్లై చేసుకోకున్నా విచ్చల విడిగా ఇల్లీగల్ నిర్మాణాలు భేషరతుగా కట్టుకోవచ్చు.దానికి కావాల్సింది కేవలం ఇక్కడి ఐలా అధికారుల చల్లని చూపు అదే అక్రమనిర్మాణాదారులకు "శ్రీరామరక్ష".

### "40ఏళ్ల క్రితం"పర్మిషన్ తో వెలుస్తున్న అతి భారీషెడ్లు..

జీడిమెట్ల ఇండస్ట్రియల్ లోని పైప్ లైన్ రోడ్డులో గల సాయికాంట సమీపంలో దాదాపు 40ఏళ్ల క్రితం తీసుకున్న పర్మిషన్స్ తో వెలుస్తున్న ఈ అతిభారీ అక్రమషెడ్ నిర్మాణం పలు అనుమానాలకు దారితీస్తోంది ..ఐలా లో ఏదైన నిర్మాణానికి అనుమతులు పొందితే కేవలం 6ఏళ్లవరకే దాని కాలపరిమితి.. 6ఏళ్లల్లో ఐలాకు సమర్పించిన ఫ్లాన్ కాపీ ఆధారంగా నిర్మాణాలు చేపట్టకపోతే పర్మిషన్ లు రద్దు అవుతాయి ..కానీ జీడిమెట్ల ఐలా లో ఓ "మేనేజర్ స్థాయి"లో ఉన్న వ్యక్తి ఈ ఇల్లీగల్ కట్టడాలన్నింటికి కార్యచరణ రూపుదాల్చుతూ అధికారులను సైతం తప్పుదోవపెట్టిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.పాత గోడలపై వెలిసే కొత్త ఇల్లీగల్ షెడ్ల మొదలు,ఇండస్ట్రీయల్ లో వెలిసే ప్రతి అక్రమకట్టడానికి సంబంధమే లేని ఐలా కార్యవర్గ సభ్యులకు సంబంధించిన కట్టడాలంటూ,మరికొన్ని "ఐలా ఉన్నతాధికారులకు సంబంధించినవంటూ చెబుతూ కాలం వెల్లదీస్తూ అక్రమాలను పెంచిపోశిస్తున్నాడు..దీనిపై సమగ్ర విచారణ జరిపి సదరు అధికారిపై చర్యలు తీసుకోని జీడిమెట్లలో పనిచేసే కార్మికుల ప్రాణాల రక్షణే ధ్యేయంగా పనిచేస్తూ,సరైన పర్మిషన్స్ రూపంలో ప్రభుత్వ కజానను సైతం నింపాలని స్థానికంగా డిమాండ్ చేస్తున్నారు..

### జీడిమెట్ల ఇండస్ట్రియల్లో విరివిగా వెలుస్తున్న అక్రమభారీ షెడ్లు,గోదాంలు..

జీడిమెట్ల పారిశ్రామికవాడలోని జయరాజ్ స్టీల్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ఓ భారీ ఇల్లీగల్ షెడ్ నిర్మాణం,నకోడా కెమికల్ ఫ్యాక్టరీ వద్ద వెలుస్తున్న ప్రమాదకరమైన గోదాం తో పాటు హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్ ప్లాంట్ ముందు వెలిసే మరో షెడ్ నిర్మాణం తో ఇక్కడి ఐలా అధికారుల సహకారం అక్రమనిర్మాణాదారులకు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఇప్పటికైనా ఇండస్ట్రీయల్ లో వెలిసే ఆ ప్రమాదకరమైన ఇల్లీగల్ షెడ్లపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు..





# నూతన బస్ స్టాప్‌కు కొరకు ఎమ్మెల్యేను కలిసిన వారాల వినోద్

- మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఎదుట బస్ షెల్టర్ ఏర్పాటు కోరుతూ విజ్ఞప్తి
- త్వరలో ఏర్పాటు చేస్తామన్న ఎమ్మెల్యే వివేకానంద్ హామీ

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 :**

సూరారం కాలనీ ప్రధాన రహదారిలోని మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఎదుట నూతన బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వారాల వినోద్ వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే నివాస



కార్యాలయంలో ఆయనను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.వినతిపత్రంలో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ వద్ద బస్ స్టాప్, బస్సు షెల్టర్ ఏర్పాటు చేస్తే హాస్పిటల్‌కు వచ్చే గర్భిణీ స్త్రీలు, వృద్ధులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రజలకు ముఖ్యంగా గర్భిణీలు, సీనియర్ సిటిజన్స్‌కు ఉపయోగకరంగా ఉండేలా బస్ స్టాప్‌ను త్వరలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్ కుమార్, ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, సత్యనారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, మనీ, సిద్ధి వినాయక నగర్ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# బీరప్ప గుడి పునర్నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం



- మెలిగిరిపేట సర్పంచ్ షాబుద్దీన్

**సదాశివపేట, ఏప్రిల్ 30 :**

సదాశివపేట మండలంలోని మేలిగిరిపేట గ్రామ సర్పంచ్ బీరప్ప గుడి పునర్నిర్మాణంలో భాగంగా గుడి నిర్మాణానికి సర్పంచ్ షాబుద్దీన్ తన వంతు విరాళం లక్ష రూపాయలు ఆలయ కమిటీ కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ గుడి నిర్మాణానికి తన వంతు విరాళం ఇవ్వడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు షాబుద్దీన్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ మీరు సదా సంతోషంగా ఆరోగ్యంగా క్రితం ప్రజలతో ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటూ షాప్ దగ్గరికి ఉన్నత స్థాయికి ఎదగాలని అత్యున్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లవిటల్, గొల్ల మల్లన్న, గొల్ల మాణిక్యం, గొల్ల సురయ్య, గొల్ల లక్ష్మయ్య గొల్ల నారాయణ, గొల్ల సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేటలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తా

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజుగౌడ్.

**సదాశివపేట, ఏప్రిల్ 30:**



సదాశివపేట కాంగ్రెస్ పార్టీ నాపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చినందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి, మా ప్రియతమ నాయకుడు టిపిసిసి వర్కింగ్ ప్రటిపిసిసి జగ్గారెడి కి, టీజీఐఐసీ చైర్మన్, డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి కి, చేర్యాల అంజన్న కు,సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి కి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్,మున్సిపల్ కౌన్సిలర్ లకు, ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మహిళా కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు ఎన్ ఎస్ యు ఐ నాయకులకు, నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. సదాశివపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా విధి నిర్వహణలో పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో అందరి సహాయ సహకారాలు ఉంటాయని ఆశిస్తున్నాను. ఇకముందు పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో అందరినీ కలుపుకుంటూ పోతూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు.

# పదవ తరగతి విద్యార్థులను అభినందించిన విద్యాశాఖ అధికారి రమేష్



**కల్వకుర్తి ఏప్రిల్ 30 :**

నాగర్ కర్నూలు జిల్లా లో పదవ తరగతి ఫలితాలలో బిజినపల్లి మండలం పాలెం గ్రామం గాయత్రి పాఠశాల విద్యార్థులు మండలంలో అగ్రస్థానంలో నిలిచినందుకు మరియు జిల్లా స్థాయిలో కూడా మంచి ప్రతిభను కనబరిచినందుకు విద్యార్థులను గురువారం అభినందించిన జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ . ప్రథమ స్థానం అలకనంద 580 మార్కులు ద్వితీయ స్థానం శివ నందిని 567 తృతీయ స్థానం కే కార్తీక్ గౌడ్ 562 చతుర్థి స్థానం హాసిని 553 లను పుష్పగుచ్చాలతో అభినందించినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రఫీ పండిత పరిషత్ రాష్ట్ర బాధ్యులు జగదీష్ గిరిజారమణ వెంకటేశ్వర్లు శైలజ శోభారాణి గారు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ గరుడ హనుమద్ మూర్తులు స్థాపన మహోత్సవం





**కూకట్ పల్లి :** కూకట్పల్లి రామాలయం వద్ద శ్రీ గరుడ హనుమద్ మూర్తులు స్థాపన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం శాంతి పాఠం, మూలమంత్ర హవనాలు, వైభవేష్టి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కళాకారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సన్మానం చేసి దేవాలయం మెమెంటో అందించారు ..ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవరంగారావు, మాజీ చైర్మన్ తులసిరావు దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కి వినతి

**కుత్బుల్లాపూర్ :** సూరారం కాలనీ ప్రధాన రహదారిలోని నారాయణ హాస్పిటల్ ఎదురుగా నూతన బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని కలిసిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వారాల వినోద్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ హాస్పిటల్ ఎదురుగా గల ప్రధాన రహదారిపై బస్ స్టాప్, బస్సు షెల్టర్ ను ఏర్పాటు చేయడం హాస్పిటల్ కి వచ్చి, వెళ్లే గర్భిణీ స్త్రీలు, సీనియర్ సిటిజన్స్ కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వినతిపత్రంలో కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ.... గర్భిణీలు, వయోవృద్ధులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండే ఈ బస్సు స్టాప్ ను వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్ కుమార్, ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, సత్యనారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, మనీ, సిద్ధి వినాయక నగర్ ఓనర్ అసోసియేషన్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చెట్ల వెంకటేష్ జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్ :**

గాజుల రామారం డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెట్ల వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా గురువారం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలువగా పుట్టినరోజు జరుపుకుంటున్న సీనియర్ నాయకులు చెట్ల వెంకటేష్ ని శాలువాతో సత్కరించి ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా గొంతుక అభ్యుదయ కాంతిరేఖ నార్ల చిరంజీవి

## సమాజ దర్పణం.. నార్ల చిరంజీవి సాహిత్యం

తెలుగు సాహిత్యంలో అభ్యుదయ భావజాలానికి, సామాజిక చైతన్యానికి అక్షర రూపం ఇచ్చిన అరుదైన సృజనశీలి నార్ల చిరంజీవి. సాహిత్యం అనేది కేవలం రసానందానికి పరిమితం కాకూడదని, అది సామాజిక పరివర్తనకు పదునైన ఆయుధంగా మలచాలని నమ్మిన నిబద్ధత కలిగిన రచయిత ఆయన. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్య చరిత్రను తిరగేస్తే, అణగారిన వర్గాల గొంతుకగా, ప్రజాస్వామ్య విలువల కాపలాదారుగా నార్ల చిరంజీవి కనిపిస్తారు. 1925 మే 1వ తేదీన కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా కాటూరు గ్రామంలో జన్మించిన ఆయన, తన 46 ఏళ్ల స్వల్ప జీవిత కాలంలోనే పీడిత ప్రజల పక్షాన నిలిచి అజరామరమైన సాహిత్యాన్ని సృష్టించారు.

నార్ల చిరంజీవి ఎదుగుతున్న కాలం దేశ చరిత్రలో అత్యంత సంక్లిష్టమైనది. ఒకవైపు పరాయి పాలన నుండి విముక్తి కోసం సాగుతున్న స్వాతంత్ర్య పోరాటం, మరోవైపు సమాజంలో పాతుకుపోయిన భూస్వామ్య వ్యవస్థ, కుల వివక్ష వంటి అంతర్గత శత్రువులపై జరుగుతున్న సంస్కరణోద్యమాలు ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. చిన్ననాటి నుంచే గ్రామీణ జీవన వాస్తవాలను, రైతాంగం అనుభవిస్తున్న వెతలను ప్రత్యక్షంగా చూసిన చిరంజీవి, ఆ వేదననే తన సాహిత్యానికి ప్రేరణగా మార్చుకున్నారు. తెలుగు, సంస్కృతం, ఆంగ్ల భాషల్లో ఆయనకు ఉన్న లోతైన పాండిత్యం, ప్రపంచ సాహిత్యంపై ఆయనకున్న అవగాహన తన భావాలను మరింత పటిష్టంగా వ్యక్తీకరించడానికి దోహదపడ్డాయి. సాహిత్యం అనేది సామాజిక వాస్తవికతకు అద్దం పట్టడమే కాకుండా, ఆ వాస్తవికతను మార్చగలిగే చైతన్యాన్ని పాఠకుడిలో రగిలించాలని ఆయన నిరంతరం తపించేవారు.

తెలుగు సాహిత్యంలో 1940 నుండి 1960 మధ్య కాలం అభ్యుదయ ఉద్యమానికి స్వర్ణయుగం. శ్రీశ్రీ 'మహాప్రస్థానం'తో సృష్టించిన ప్రభంజనం యువతలో నూతన ఉత్తేజాన్ని నింపింది. అదే కాలంలో చిరంజీవి తన రచనా ప్రస్థానాన్ని ప్రారంభించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో, అభ్యుదయ రచయితల సంఘం (అరసం)లో చురుగ్గా పాల్గొన్న ఆయన, మార్క్సిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడైనప్పటికీ, తన రచనల్లో ఎక్కడా యాంత్రికతకు తావివ్వలేదు. అట్టడుగు వర్గాల జీవన పోరాటాన్ని, శ్రమజీవుల స్వేదాన్ని ఆయన తన అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. దాశరథి, ఆరుద్ర, కొడవటిగంటి కుటుంబరావు వంటి దిగ్గజాలతో కలిసి నడిచినా, చిరంజీవి తనకంటూ ఒక విశిష్టమైన శైలిని ఏర్పరచుకున్నారు. భావోద్వేగాల కంటే హేతుబద్ధమైన విశ్లేషణకు ఆయన ప్రాధాన్యతనిచ్చారు.

నార్ల చిరంజీవి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కథలు, వ్యాసాలు, కవితలు, నాటకాలు, విమర్శలు అన్నీ కూడా సామాజిక న్యాయం అనే ఏకైక లక్ష్యంతో సాగాయి. పత్రికా రంగంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. 'విశాలాంధ్ర' దినపత్రికలో కొంతకాలం పాటు 'చిన్నారి లోకం' అనే బాలల శీర్షికను నిర్వహించి, బాల సాహితీకారుడిగా కూడా ప్రత్యేక ముద్ర వేశారు. 1949-50 కాలంలో విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో పని చేస్తూ రేడియో ప్రసంగాల ద్వారా సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. కేవలం అభ్యుదయ రచయితగానే కాకుండా, సినిమా పాటల రచయితగా కూడా ఆయన తన ప్రతిభను చాటారు.

"శ్రమజీవుల స్వేద బిందువులు చిమ్మి. ఈ ధరణిని తడిపి పచ్చని పైరులు పండించి, ఆకలి తీర్చే అన్నదాతల ఆవేదన విన్నారా?వారి గుండెల్లో రగిలే విప్లవ జ్వాలలు కన్నారా?' ఈ పంక్తుల్లో ఆయన రైతాంగ పోరాటాల పట్ల, శ్రమజీవుల కష్టాల పట్ల ఎంతటి ఆర్తిని కలిగి ఉన్నారో స్పష్టమవుతుంది. మానవతావాదం నార్ల చిరంజీవి సాహిత్యానికి ప్రాణవాయువు. కులమతాల పేరిట మనుషుల మధ్య గోడలు కట్టే శక్తులపై ఆయన అక్షర యుద్ధం ప్రకటించారు. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేనంత వరకు నిజమైన విముక్తి కలగదని నమ్మిన ప్రగతిశీలవాది ఆయన.

విమర్శా రంగంలో చిరంజీవి శైలి విలక్షణమైనది. సాహిత్యాన్ని కేవలం ఛందస్సు పరిధిలో చూడడాన్ని ఆయన అంగీకరించలేదు. అభ్యుదయ విమర్శకు ఒక శాస్త్రీయ పద్ధతిని జోడించిన ఘనత ఆయనది. ఆయన భాష అత్యంత సరళంగా ఉండి, సామాన్య పాఠకుడికి సైతం అర్థమయ్యేలా ఉంటుంది. గ్రామీణ మాండలికాలను గౌరవించి వాటికి సాహితీ గౌరవం కల్పించారు. నేటి సమాజంలో పెరుగుతున్న అసహనం, సంకుచిత భావాల నేపథ్యంలో చిరంజీవి వంటి రచయితల అవసరం ఎంతైనా ఉంది.




నార్ల చిరంజీవి కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక సాహిత్య ఉద్యమం. ఆయన అక్షరాలు అన్యాయాన్ని ప్రశ్నించే గొంతుకలై ప్రతిధ్వనిస్తాయి. 1971లో ఆయన భౌతికంగా మనల్ని విడిచి వెళ్లినా, ఆయన నాటిన అభ్యుదయ బీజాలు నేటికీ చిగురిస్తూనే ఉన్నాయి. ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయనకున్న అచంచలమైన విశ్వాసం, సామాజిక సమానత్వం కోసం ఆయన సాగించిన అక్షర శ్రమ రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకం. తెలుగు సాహిత్య చరిత్రలో అభ్యుదయ శిఖరంగా నార్ల చిరంజీవి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# శ్రామిక విజయానికి చిహ్నం మేడ

## నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

**మే దినోత్సవం కార్మిక ఐక్యతకు సంకేతం. చైతన్యానికి ప్రతిరూపం. చాకిరీకి వ్యతిరేకంగా నినదించిన నేపథ్యం. వేలాది గొంతుకలు ఒక్కటైన సమయం. కార్మిక వర్గ పోరాట పటిమకు నిలువెత్తు నిదర్శనం. ఎనిమిది పని గంటల దినం కోసం పోరాట సందర్భం. ప్రాణ త్యాగాలకు వెరవని వైనం. యాజమాన్యం దిగి వచ్చిన క్రమం. నెరవేరిన కార్మిక లక్ష్యం. కార్మికులు సాధించిన విజయానికి నిలువెత్తు సాక్ష్యం. కొందరు కార్మికుల రక్త తర్పణం తో కార్మిక ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చిన నేపథ్యం.**

1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో పరిమిత పని దినాలను కోరుతూ లక్షలాది మంది కార్మికులు సమ్మె చేశారు. ప్రదర్శనను చెదర గొట్టేందుకు పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. మార్కెట్ ప్రాంతమంతా రక్తసిక్తమై కార్మికుల హాహాకారాలతో దద్దరిల్లింది. ఒక పోలీసు సార్జెంట్‌ను హత్య చేశారనే నిరాధార అభియోగంతో కార్మిక నాయకులైన పార్సన్, స్పైస్, ఏంగెల్,ఫిషెలను దారుణంగా ఉరి తీశారు.




**ఉరికంబ మెక్కిన "స్పైస్" నేను ఉరి తీయబడినంత మాత్రాన ఈ అగ్ని జ్వాల అంతరించదు. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అని ప్రభోదించాడు. స్పైస్ మరణ నినాదం శ్రామిక జన శంఖారావమై విశ్వవ్యాప్తంగా మార్మోగి శ్రామిక చైతన్యాన్ని రగుల్కొలిపింది.**

చికాగో అమరవీరుల సంస్మరణ దినంగా చరిత్రకెక్కిన మే 1 మేడే గా నిలిచి పోయింది. ఈ ఉద్యమం ప్రాదేశిక సరిహద్దులు దాటి ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తరించి చివరకు శ్రామిక విజయానికి చిహ్నంగా రోజుకు 8 గంటల పని చట్టబద్ధం చేయబడింది. అదే మేడే కు అంకురార్పణ.

**1890 మే 1వ తేదీన అమెరికా కార్మిక సంస్థ (ఎ.ఫ్.ఎల్) ఏటా మే 1 అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవంగా జరపాలని సూచించింది. నాటి నుండి నేటి వరకు ఈ మేడే విశ్వవ్యాప్తంగా ఆచరణీయమైంది. ట్రేడ్ యూనియన్లు గాని, పార్లమెంటు గానీ లేని రష్యాలో 1891 మే 1న మార్క్సిస్టులు రహస్యంగా తొలిసారిగా అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవం జరిపారు. ఆనాటి నుండి మే దినోత్సవ సంబరం రష్యా కార్మిక వర్గ విప్లవాత్మక సంప్రదాయంగా పరిణమించింది.**

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో మే డే నాడు యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టేవారు. తరవాతి దశకంలో మే 1ని నాజీల వ్యతిరేక దినోత్సవంగా జరిపేవారు. హిట్లర్ పాలనలో ఆ రోజుని జాతీయ కార్మికుల దినోత్సవంగా జరుపుకునే వారు. ఇటలీలో ముసోల్నీ, స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకోలు మే డే పైన అనేక ఆంక్షలను విధించారు.

**భారత దేశంలో చికాగో కంటే ముందే కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్లో 1862లో సమ్మెచేశారు. అప్పటి వరకు ఆ రైల్వే కార్మికులు గంటలు పనిచేసే వారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలక వర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పని చేస్తారో మేము కూడా అన్ని గంటలే పని చేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు.**

తొలిసారిగా భారత్‌లో 1923 సంవత్సరంలో మే 1వ తేదీ మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను జరుపు కున్నారు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటంతో అప్పటి నుంచే కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. ఈ చైతన్యంతో 'మే డే'ను పాటిస్తున్నారు.



పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమదోపిడీ, అధికంగా పనిచేయించు కోవడం కద్దు. నానాటికీ నిరుద్యోగ రక్కసి విజృంభిస్తున్న నేపథ్యంలో, ఎలాగైనా ఉద్యోగం పొందాలనే తపన, బలహీనత క్రమంలో, ప్రపంచ బ్యాంకు, బహుళజాతి కంపెనీల ఒత్తిళ్ళ ఫలితంగా... కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు హామీలిస్తున్నాయి. ఐ.టి.రంగంలో మార్కెట్ శక్తుల ద్వారా శ్రమ దోపిడీ నానాటికీ పెట్రేగి పోతున్నది.

**అమెరికా కేంద్రంగా వున్న కంపెనీలు... కార్మిక చట్టాలు అమలుకు నిచుకొని మన దేశంలో కంపెనీలు పెడుతూ, పని వేళలకు మించి రాచి రంపాన పెడుతున్నారు. అలా విద్యావంతులైన యువత అధిక జీతాలకు ఆశపడి, కంపెనీల నియంతృత్వ పోకడలకు తలొగ్గి, ఆరోగ్యాలను ఫణంగా పెట్టి, జీవితాలను కొవ్వొత్తుల్లా కరిగించు కుంటున్నారు.**



కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో అమలుకై పోరాటం అత్యంత అవసరం, అనివార్యం. ఇక అసంఘటితరంగం. గురించి చెప్పాల్సిన అవసరం లేదు. కాంట్రాక్టు, పార్ట్‌టైం, ఔట్ -- సోర్సింగ్‌లోను ఉద్యోగులకు ఏ కార్మిక చట్టాల నియమాలు వర్తించవు. శతాబ్ద కాలం నాటి పరిస్థితులే పునరావృతం అవుతున్న వేళ...ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా... అలనాటి కార్మికవర్గ చైతన్యం మళ్లీ రావాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# నిబద్ధతకు నిలువెత్తు రూపం.. పుచ్చలపల్లి సుందరయ్య

## పోరాటాలే ఆయన శ్వాస

## నేడు 'కమ్యూనిస్టు గాంధీ' జయంతి..



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

శ్రమ జీవుల కోసం, సమ సమాజ స్థాపన కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు, 'కామ్రేడ్ పి.ఎస్'గా పిలవబడే పుచ్చలపల్లి సుందరయ్య జయంతి నేడు. 1913 మే 1న నెల్లూరు జిల్లా అలగానిపాడులో ఒక భూస్వామ్య కుటుంబంలో జన్మించిన ఆయన, కుల వ్యవస్థను నిరసించి తన పేరులోని 'రెడ్డి' అనే పదాన్ని తొలగించుకున్న ఆదర్శవాది. ప్రపంచ కార్మిక దినోత్సవం రోజునే జన్మించిన సుందరయ్య, కన్నుమూసే వరకు కమ్యూనిస్టు భావజాలానికే అంకితమై 'కమ్యూనిస్టు గాంధీ'గా పేరుగాంచారు.

### త్యాగమే ఆయన మార్గం:

సుందరయ్య కేవలం మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో తన నిబద్ధతను చాటుకున్నారు. తన వాటా కింద వచ్చిన యావదాస్తిని ప్రజా పోరాటాల కోసం ఖర్చు చేసిన అరుదైన నాయకుడు ఆయన. పార్టీకి, ప్రజలకు పూర్తి కాలం సేవ చేయాలనే ఉద్దేశంతో పి ల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న ఆయన త్యాగం అనన్యం. 1930లో 17 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. జైలులోనే కమ్యూనిస్టు భావజాలం పట్ల ఆకర్షితులైన ఆయన, అమీర్ హైదర్ ఖాన్ స్ఫూర్తితో పార్టీలో చేరారు.

### సాయుధ పోరాట సేనాని:

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుందరయ్యది కీలక పాత్ర. ఆ పోరాట కాలంలో నాలుగేళ్ల పాటు అజ్ఞాతంలో గడిపి, అణగారిన వర్గాల కోసం పోరాడారు. 1964లో సీపీఐ(ఎం) ఏర్పడటంలో ప్రధాన పాత్ర పోషించిన ఆయన, ఆ పార్టీకి తొలి సాధారణ కార్యదర్శిగా సుదీర్ఘ కాలం సేవలందించారు. పార్లమెంటు రాజ్యసభకు, రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికైనప్పటికీ, తన నిరాడంబరతను ఏనాడూ వీడలేదు.

### సైకిల్‌పై అసెంబ్లీకి..:

నేటి తరం రాజకీయ నాయకులకు సుందరయ్య ఒక గొప్ప పాఠం. శాసనసభ సభ్యునిగా ఉన్న సమయంలో ఆయన సైకిల్‌పై అసెంబ్లీకి వెళ్లేవారంటే ఆయన నిరాడంబరత అర్థం చేసుకోవచ్చు. 1985 మే 19న ఆయన కన్నుమూసే వరకు పేదరికం, దోపిడీ లేని సమాజం కోసం పరితపించారు. ఆయన జయంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని కమ్యూనిస్టు శ్రేణులు మరియు అభిమానులు ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటున్నారు.




# భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు

## రూపాయి విలువ 95.07కు చేరిక

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 :** దేశీయ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొసాగుతుండటంతో చమురు ధరలు భగ్గమంటున్నాయి. దాంతో మన సూచీలపై బేర్ పట్టు బిగించింది. దాంతో ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 1000 పాయింట్ల వరకు నష్టపోయింది. ఉదయం సెన్సెక్స్ 868 పాయింట్లు పతనమై, 76,623 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 278 పాయింట్లు క్షీణించి, 23,899 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో బజాజ్ ÷నాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. ఎటర్నల్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రా టెక్ సిమెంట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎంఅండ్ఎం షేర్లు నష్టాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. ఉదయం సెషన్‌లో తొలిసారి ఏకంగా 95.07 వద్ద ప్రారంభమై.. సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని తాకింది.

# స్వల్పంగా తగ్గిన బంగారం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, డాలర్ బలపడడం వంటి కారణాలతో బంగారం ధరలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వెళ్లిన బంగారం ధరలు ప్రస్తుతం తగ్గుతుండడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభిస్తోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,430గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,37,890గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,580గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,040గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదల నమోదు చేశాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,64,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,54,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.రూ.2,64,900గా, బెంగళూరులో రూ.రూ.2,54,900 ఉంది.

# జ్యూరిచ్ ఇన్సూరెన్స్ జీసీసీ హెడ్‌గా అమిత్ కల్రా

**హైదరాబాద్:** బీమా రంగంలోని జ్యూరిచ్ ఇన్సూరెన్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) హెడ్‌గా అమిత్ కల్రాను నియమిస్తున్నట్లు వెల్లడించింది. జులై 1 నుంచి ఈ బాధ్యతలు చేపట్టి, ఈ కేంద్రం విస్తరణతోపాటు, ప్రపంచవ్యాప్తంగా అన్ని సెంటర్ల కార్యకలాపాలను భారతదేశం కేంద్రంగా ఆయన పర్యవేక్షిస్తారని పేర్కొంది. ఇంజినీరింగ్ నైపుణ్యాల పరంగా హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, అందుకే, ఇక్కడి నైపుణ్యాలను వినియోగించుకునేందుకు ఈ కేంద్రం తోడ్పడుతుందని జ్యూరిచ్ గ్లోబల్ బిజినెస్ అండ్ ఆపరేషన్స్ సీఈఓ కారా మోర్టన్ తెలిపారు. కేంద్రం కార్యకాలాపాలు విస్తరిస్తున్న కొద్దీ, భారీ ఎత్తున నిపుణులను నియమించుకుంటామని జ్యూరిచ్ వెల్లడించింది. క్లౌడ్ ప్లాట్‌ఫాం, డేటా, ఏఐ, అప్లికేషన్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, క్వాలిటీ ఇంజినీరింగ్ విభాగాల్లో ఆధునిక పరిష్కారాలను సంస్థ ఇక్కడ రూపొందించనుంది.



# నేడు గ్యాస్ ధరల సవరణ.. బాదుడు తప్పదా?



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 :** పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఇప్పుడు సామాన్యుడి వంటగదిపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ముడి చమురు ధరలు అంతర్జాతీయంగా పెరుగుతుండటంతో, దేశంలో ఎల్‌పీజీ వినియోగదారులు మే 1న జరగబోయే ధరల సవరణపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్యాస్ ధరలు పెరుగుతాయా? లేదా అన్న దానిపై స్పష్టత లేకపోయినా, పెంపు అవకాశాలు ఉన్నాయనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. గత కొన్ని నెలలుగా గృహ వినియోగ సిలిండర్ల ధరలు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. ఏప్రిల్ నెలలోనే గృహ సిలిండర్‌పై సుమారు రూ.60 వరకు భారం పడగా, కమర్షియల్ సిలిండర్ల ధరలు వందల రూపాయల్లో పెరగడం హోటల్, రెస్టారెంట్ వ్యాపారాలపై ప్రభావం చూపింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరల పెరుగుదల నేరుగా దేశీయ గ్యాస్ ధరలపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, కొన్ని ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ బుకింగ్‌పై కూడా పరిమితులు అమల్లోకి వచ్చాయి. పట్టణ ప్రాంతాల్లో ఒకసారి సిలిండర్ బుక్ చేసిన తర్వాత, మరొకటి పొందడానికి కనీసం 25 రోజుల గ్యాప్ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వినియోగదారులు ముందుగానే ప్లాన్ చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఇంకోవైపు ప్రభుత్వం ఇంధన వినియోగ విధానంలో మార్పులు తీసుకువస్తోంది. పైపుల ద్వారా వచ్చే సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, భారతదేశంలోని పలు నగరాల్లో పీఎన్‌జీ కనెక్షన్లను వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే సదుపాయం ఉన్న ప్రాంతాల్లో ఎల్‌పీజీ నుంచి పీఎన్‌జీకి మారాలని సూచనలు చేస్తున్నట్లు సమాచారం. భవిష్యత్తులో ఎల్‌పీజీపై ఆధారాన్ని తగ్గించే దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. అదేవిధంగా, ప్రధాన మంత్రి ఉజ్జ్వల యోజన లబ్ధిదారులకు ఈ-కేవైసీ తప్పనిసరి చేయడం కూడా మరో కీలక మార్పు. సబ్సిడీ కొనసాగించుకోవాలంటే ప్రతి సంవత్సరం ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇలా ఒకవైపు అంతర్జాతీయ పరిస్థితులు, మరోవైపు దేశీయ విధాన మార్పులు కలిసి గ్యాస్ వినియోగదారులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. మొత్తానికి, మే 1న ధరలు పెరుగుతాయా లేదా అన్నది అధికారిక ప్రకటనపై ఆధారపడి ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితులను చూస్తే వినియోగదారులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి.

# ఈపీఎఫ్ చందాదారులకు డబుల్ గుడ్ న్యూస్

## పెన్షన్ భారీ పెంపు, ఏటీఎం విత్‌డ్రా సౌకర్యం!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు కీలకమైన ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నుంచి చందాదారులకు భారీ శుభవార్తలు రానున్నాయి. కనీస పెన్షన్ పెంపుతో పాటు, ఏటీఎంల ద్వారా పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని కూడా తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం, ఈపీఎఫ్ఓ ఆలోచిస్తున్నాయి. ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే దేశంలోని కోట్లాది ఉద్యోగులకు పెద్ద ఊరట లభించనుంది. ప్రస్తుతం ఉద్యోగుల పెన్షన్ పథకం 1995 కింద కనీస పెన్షన్ రూ.1,000గా ఉంది. దీన్ని ఏకంగా రూ.7,500కు పెంచాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. కార్మిక సంఘాల డిమాండ్లు, పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో ఈ అంశంపై కేంద్రం సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు సమాచారం. దీనిపై త్వరలో తుది నిర్ణయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇదే సమయంలో చందాదారుల ఖాతాలకు 8.25 శాతం వడ్డీ రేటు ఇవ్వడానికి కూడా ఈపీఎఫ్ఓ సిద్ధంగా ఉంది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. వడ్డీ రేటు పెంపుతో ఉద్యోగుల పొదుపులకు మరింత లాభం చేకూరనుంది. చందాదారులకు మరింత సౌకర్యంగా ఉండేందుకు, ఏటీఎంల ద్వారా నేరుగా పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేసుకునే వ్యవస్థను తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది అమలైతే అత్యవసర సమయాల్లో డబ్బులు త్వరగా పొందడం చాలా సులభమవుతుంది. బ్యాంకు ప్రక్రియల కోసం ఎక్కువ సమయం వేచి చూడాల్సిన అవసరం తగ్గుతుంది. ఇక క్లెయిమ్స్ పరిష్కారంలో కూడా ఈపీఎఫ్ఓ రికార్డు స్థాయి ప్రగతి సాధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 8.31 కోట్ల క్లెయిమ్స్‌ను సెటిల్ చేసి కొత్త రికార్డు సృష్టించింది. ఆటోమేషన్, డిజిటల్ ప్రాసెస్‌లతో క్లెయిమ్స్ పరిష్కారం వేగవంతమై, సుమారు 71 శాతం అడ్వాన్స్ క్లెయిమ్స్‌ను మూడు రోజుల్లోనే పరిష్కరించడం గమనార్హం. అదనంగా, పాత పీఎఫ్ ఖాతాలను సులభంగా యాక్టివేట్ చేసుకునేందుకు 'ఈ-ప్రాప్తి' పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. ఆధార్ ఆధారంగా యాక్సెస్ తీసుకుని పాత ఖాతాలను తిరిగి యాక్టివ్ చేసుకునే వీలుతో చందాదారులకు మరింత సౌలభ్యం కలిగింది. మొత్తంగా చూస్తే, పెన్షన్ పెంపు, ఏటీఎం విత్‌డ్రా, వడ్డీ పెంపు వంటి మార్పులు అమలైతే భారతదేశంలోని ఉద్యోగులు, కార్మికుల ఆర్థిక భద్రత మరింత బలపడనుంది. త్వరలో అధికారిక ప్రకటన కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.

# ఎక్కువ క్రెడిట్ కార్డులు ఉంటే ఎక్కువ రివార్డులా?




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** క్రెడిట్ కార్డులు ఎక్కువగా ఉంటే ఎక్కువ రివార్డులు వస్తాయని భావించే ట్రెండ్ ఇప్పుడు మారుతోంది. బ్యాంకులు అందించే లాంజ్ యాక్సెస్, సినిమా టికెట్ ఆఫర్లు వంటి ప్రయోజనాలు కఠినమైన ఖర్చు నిబంధనలకు అనుసంధానించడంతో, అనేక కార్డులు కలిగి ఉండటం కంటే తక్కువ కార్డులను సమర్థంగా వినియోగించడం ఉత్తమ మార్గంగా మారుతోంది. ఇటీవల కాలంలో చాలా బ్యాంకులు తమ ఆఫర్లకు ఖర్చు పరిమితులు పెట్టాయి. ఉదాహరణకు ఐ సి ఐ సి ఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుతో బుక్‌మైషో ఆఫర్ పొందాలంటే త్రైమాసికంలో కనీసం రూ.25,000 ఖర్చు చేయాలి. అలాగే హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ క్రెడిట్ కార్డులపై ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ కోసం రూ.60,000 వరకు ఖర్చు షరతు అమల్లోకి రానుంది. కొన్ని కార్డులపై ఈ పరిమితి రూ.75,000 వరకు ఉండొచ్చు. దీంతో ఖర్చును అనేక కార్డులపై విభజిస్తే, ఒక్క కార్డుపైనా పూర్తి ప్రయోజనం పొందడం కష్టమవుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, వినియోగదారులు 2--3 లేదా గరిష్ఠంగా 4 క్రెడిట్ కార్డులకు మాత్రమే పరిమితం అవడం మంచిది. మీ ఖర్చు అలవాట్లను బట్టి కార్డులను ఎంచుకుని, వాటిని స్పష్టమైన విధంగా ఉపయోగించడం వల్ల ఎక్కువ రివార్డులు పొందవచ్చు. ఉదాహరణకు ప్రయాణ ఖర్చులకు ఒక కార్డ్, రోజువారీ ఖర్చులకు మరో కార్డ్, పెద్ద కొనుగోళ్ల కోసం ఇంకొక కార్డ్ ఇలా విభజించుకోవడం ఉత్తమం. అదనంగా, ప్రతి కార్డ్‌కు సంబంధించిన పునరుద్ధరణ రుసుములు, రివార్డు పాయింట్ల గడువు, మారుతున్న ఆఫర్లను కూడా గమనించడం అవసరం. అవసరం లేకుండా ఎక్కువ కార్డులు తీసుకోవడం వల్ల వార్షిక ఫీజులు పెరగడమే కాకుండా, నిర్వహణ కూడా కష్టమవుతుంది. మొత్తంగా, ఎక్కువ కార్డులు అంటే ఎక్కువ లాభం అనే పాత ఆలోచన ఇక పనిచేయడం లేదు. సరైన కార్డులను ఎంచుకుని, ఖర్చును ఒకే దిశలో కేంద్రీకరించడం ద్వారా డబ్బు ఆదా చేసుకోవడంతో పాటు గరిష్ఠ ప్రయోజనాలు పొందవచ్చు.

# 5జీ సేవల్లో జియో టాప్..




**వరంగల్, ఏప్రిల్ 30:** తెలంగాణలో 5జీ నెట్‌వర్క్ సేవల్లో జియో అగ్రస్థానంలో నిలిచింది. టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ మార్చి 2026లో నిర్వహించిన స్వతంత్ర డ్రైవ్ టెస్ట్‌లో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా వరంగల్ నగరంలో జియో 5జీ సేవలు వేగం, కాల్ నాణ్యత, సిగ్నల్ బలం, లేటెన్సీ వంటి అన్ని విభాగాల్లో ఇతర నెట్‌వర్క్‌ల కంటే ముందంజలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో వినియోగదారులకు స్థిరమైన కనెక్టివిటీతో పాటు అధిక డేటా వేగం లభిస్తున్నట్టు స్పష్టమైంది. నివేదిక ప్రకారం జియో సగటు డౌన్‌లోడ్ వేగం 260.01 మెగాబిట్లు ప్రతిసెకన్‌గా నమోదైంది. అదే సమయంలో ఎయిర్‌టెల్ 161.18 మెగాబిట్లు, వోడాఫోన్ ఐడియా 27.83 మెగాబిట్లు, బీఎస్ఎన్ఎల్ 8.32 మెగాబిట్ల వద్ద నిలిచాయి. ఈ గణాంకాలు చూస్తే వీడియో స్ట్రీమింగ్, ఆన్‌లైన్ గేమింగ్ వంటి సేవల్లో జియో వినియోగదారులు మరింత వేగవంతమైన అనుభవాన్ని పొందుతున్నారని అర్థమవుతోంది. వరంగల్‌లోని హాట్‌స్పాట్ ప్రాంతాల్లో అయితే వేగం మరింత పెరిగి హనుమకొండ బస్ స్టాండ్ వద్ద 471.60 మెగాబిట్లు, రెడ్డి కాలనీలో 456.67 మెగాబిట్ల పీక్ స్పీడ్లు నమోదయ్యాయి. కేవలం డేటా వేగం మాత్రమే కాకుండా వాయిస్ కాల్ నాణ్యతలో కూడా జియో ముందంజలో నిలిచింది. ట్రాయ్ నివేదిక ప్రకారం జియో మీన్ ఓపీనియన్ స్కోర్ 4.46గా నమోదవగా, ఎయిర్‌టెల్ 3.98, వోడాఫోన్ ఐడియా 3.76, బీఎస్ఎన్ఎల్ 2.97 స్కోర్లు సాధించాయి. అంటే కాల్ స్పష్టత విషయంలో కూడా జియో సేవలు మెరుగ్గా ఉన్నాయని అర్థమవుతోంది. అలాగే లేటెన్సీ పరంగా జియో 21.94 మిల్లీసెకన్లతో ఇతర నెట్‌వర్క్‌ల కంటే చాలా తక్కువగా ఉండటం గమనార్హం. ఇది గేమింగ్, వీడియో కాలింగ్ వంటి రియల్ టైమ్ అప్లికేషన్లలో వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని అందిస్తోంది. ఇంకా ముఖ్యంగా కాల్ డ్రాప్ రేటు 0 శాతంగా నమోదు కావడం జియో నెట్‌వర్క్ విశ్వసనీయతను స్పష్టంగా చూపిస్తోంది. గత రెండు సంవత్సరాల్లో తెలంగాణలో 5జీ సేవలు వేగంగా విస్తరించాయి. 2024లో ప్రారంభమైన ఈ సేవలు 2026 నాటికి ప్రధాన నగరాలతో పాటు వరంగల్ వంటి టియర్-2 నగరాల్లో కూడా స్థిరపడ్డాయి. ఇది డిజిటల్ కనెక్టివిటీ విస్తరణకు ఒక పెద్ద సంకేతంగా భావిస్తున్నారు. మొత్తానికి ట్రాయ్ నివేదిక ప్రకారం జియో 5జీ సేవలు వేగం, నాణ్యత, స్థిరత్వం పరంగా ఇతర నెట్‌వర్క్‌లను మించి వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని అందిస్తున్నాయి. భవిష్యత్తులో 5జీ ఆధారిత సేవలు మరింత విస్తరించే అవకాశాలున్న నేపథ్యంలో, టెలికాం రంగంలో పోటీ ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# 70 కోట్ల యూజర్ల మైలురాయి దాటిన ఫోన్‌పే

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 :** దేశంలో డిజిటల్ చెల్లింపుల రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న ఫోన్‌పే మరో భారీ మైలురాయిని చేరుకుంది. సంస్థ ప్లాట్‌ఫామ్‌పై రిజిస్టర్డ్ వినియోగదారుల సంఖ్య 70 కోట్లను దాటినట్లు అధికారికంగా ప్రకటించింది. దేశ జనాభాలో పెద్ద భాగాన్ని చేరుకోవడం ద్వారా డిజిటల్ లావాదేవీల విస్తరణలో ఫోన్‌పే కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రతి ఆరు రోజులకు 10 లక్షల కొత్త యూజర్లు ఫోన్‌పే వృద్ధి వేగం ఇప్పుడు మరింత పెరిగింది. ప్రారంభ దశలో మొదటి 10 లక్షల యూజర్లను చేరుకోవడానికి 136 రోజులు పట్టగా, ప్రస్తుతం కేవలం 6 రోజుల్లోనే అదే సంఖ్యలో కొత్త వినియోగదారులు చేరుతున్నారు. 2023 నుంచి 2025 వరకు సంస్థ సుమారు 56 శాతం పైగా స్థిరమైన వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది. సులభమైన వినియోగం, సురక్షిత చెల్లింపులు, విస్తృత సేవలే ఈ వేగానికి కారణమని కంపెనీ పేర్కొంది. వినియోగదారుల నమ్మకమే బలం ఈ విజయంపై సంస్థ సీఈవో స్పందిస్తూ, "70 కోట్ల యూజర్ల మార్కును దాటడం మా ప్రయాణంలో ఒక ముఖ్య ఘట్టం. దేశవ్యాప్తంగా వినియోగదారులు మాపై ఉంచిన నమ్మకానికి ఇది నిదర్శనం. భవిష్యత్తులో కూడా సులభమైన, సురక్షితమైన సేవలను అందించడంపై మా దృష్టి ఉంటుంది" అని తెలిపారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర డిజిటల్ చెల్లింపులు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, భారతదేశంలో ఫోన్‌పే వంటి ప్లాట్‌ఫామ్‌లు ఆర్థిక వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభంగా మార్చుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు విస్తరించిన సేవలతో, ఈ యాప్ కోట్లాది మంది జీవితాల్లో భాగమైంది. మొత్తంగా, 70 కోట్ల యూజర్ల మైలురాయి ఫోన్‌పే ప్రస్థానంలో కీలక ఘట్టంగా నిలిచింది. రాబోయే రోజుల్లో మరింత సేవల విస్తరణతో ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.





## శార్దూల్‌పై వింత వ్యూహం

**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ 2026లో ముంబై జట్టు మరో ఓటమిని చవిచూసిన మ్యాచ్ కంటే, ఆ జట్టు తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన పోరులో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్ గానీ, బౌలింగ్ గానీ చేయకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్లుగా వచ్చిన విల్ జాక్స్, రియాన్ రికిల్టన్ మంచి ఆరంభం ఇవ్వగా, ముఖ్యంగా రియాన్ రికిల్టన్ అద్భుత సెంచరీతో చెలరేగి జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. అతని దూకుడు బ్యాటింగ్‌తో ముంబై నిర్ణీత ఓవర్లలో భారీ పరుగులు చేసింది. అయితే లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఓపెనింగ్‌లోనే వేగంగా పరుగులు సాధించి జట్టుకు బలమైన పునాది వేశారు. అనంతరం హెన్రిచ్ క్లాసెన్ వేగవంతమైన అర్ధశతకంతో మ్యాచ్‌ను హైదరాబాద్ వైపు తిప్పేశాడు. దీంతో హైదరాబాద్ జట్టు లక్ష్యాన్ని సులభంగా ఛేదించింది. అయితే మ్యాచ్ తర్వాత ఎక్కువ చర్చకు దారి తీసింది ముంబై జట్టు వ్యూహమే. ఇంపాక్ట్ ప్లేయర్‌గా తీసుకొచ్చిన శార్దూల్ ఠాకూర్‌ను ఎందుకు ఉపయోగించలేదన్న ప్రశ్నలు సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తాయి. ఐపీఎల్ చరిత్రలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి ఒక్క బంతి కూడా ఆడకపోవడం అరుదైన సంఘటనగా అభిమానులు చర్చిస్తున్నారు. ఈ నిర్ణయం వెనుక అసలు వ్యూహం ఏమిటో స్పష్టత లేకపోవడంతో ముంబై యాజమాన్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం మీద ఈ మ్యాచ్ ఫలితంతో పాటు, శార్దూల్ అంశం కూడా ఈ సీజన్‌లో ప్రధాన చర్చాంశంగా మారింది.



## హిట్‌మ్యాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**ముంబై, ఏప్రిల్ 30 :** భారత క్రికెట్ జట్టు కెప్టెన్, 'హిట్‌మ్యాన్'గా పేరుగాంచిన రోహిత్ శర్మ ఇవాళ 39వ పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు, ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. భారత జట్టుకు ఐసీసీ ట్రోఫీలు అందించిన ప్రముఖ కెప్టెన్లలో రోహిత్ శర్మ ఒకరు. టెస్టులు, టీ20 ఫార్మాట్లకు ఇప్పటికే వీడ్కోలు పలికిన రోహిత్ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నారు. ఐపీఎల్‌లో ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన, గాయం కారణంగా ఇటీవల కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉన్నారు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా రోహిత్ శర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు. 2014లో శ్రీలంకపై జరిగిన మ్యాచ్‌లో ఆయన 173 బంతుల్లోనే 264 పరుగులు చేసి చరిత్ర సృష్టించారు. అంతేకాకుండా వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్ కూడా ఆయనే. 2013లో ఆస్ట్రేలియాపై 209 పరుగులు, 2014లో శ్రీలంకపై 264 పరుగులు, 2017లో మరోసారి శ్రీలంకపైనే 208 పరుగులు చేసి అరుదైన రికార్డును నెలకొల్పారు. 2019 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ అద్భుత ప్రదర్శన కనబరిచి 9 ఇన్నింగ్స్‌ల్లో 5 శతకాలు నమోదు చేశారు. మొత్తంగా ప్రపంచకప్‌లలో ఆయన 7 శతకాలు సాధించడం విశేషం. నాయకత్వంలో కూడా రోహిత్ విజయవంతంగా కొనసాగుతూ, 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ టోర్నీల్లో భారత్‌ను విజేతగా నిలిపారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు 650 సిక్సర్లు బాదిన రోహిత్, ఈ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని 359 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నారు. తన అద్భుత ఆటతీరుతో, నాయకత్వంతో భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన రోహిత్ శర్మకు అభిమానులు మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

# సొంతగడ్డపై గుజరాత్ గర్జన!



బెంగళూరుపై నాలుగు వికెట్ల తేడాతో టైటాన్స్ ఘన విజయం

155 పరుగులకే కుప్పకూలిన ఆర్సీబీ బ్యాటింగ్

ఆడుతూపాడుతూ లక్ష్యాన్ని ఛేదించిన గుజరాత్ బ్యాటర్లు

చెలరేగిన శుభ్‌మన్ గిల్, బట్లర్, అర్షద్ ఖాన్

వృథా అయిన పడిక్కల్, భువనేశ్వర్ పోరాటం

**అహ్మదాబాద్:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా గురువారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై గుజరాత్ టైటాన్స్ అద్భుత విజయం సాధించింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమష్టిగా సత్తా చాటిన టైటాన్స్ జట్టు.. సొంతగడ్డపై అభిమానులకు అసలైన మజాను పంచింది. బెంగళూరు నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది.

### తడబడిన ఆర్సీబీ..



అంతకుముందు టాస్ గెలిచిన గుజరాత్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన బెంగళూరు జట్టు ఏ దశలోనూ భారీ స్కోరు చేసేలా కనిపించలేదు. గుజరాత్ బౌలర్ల ధాటికి 19.2 ఓవర్లలో 155 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ దేవ్‌దత్ పడిక్కల్ 24 బంతుల్లో 40 పరుగులు చేసి జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 13 బంతుల్లో 28 పరుగులతో కాసేపు మెరుపులు మెరిపించినా ఆ ఇన్నింగ్స్ ఎక్కువ సేపు సాగలేదు. రజత్ పాటిదార్ 15 బంతుల్లో 19 పరుగులు చేశాడు. గుజరాత్ బౌలర్లలో అర్షద్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3.2 ఓవర్లలో 22 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నాలుగు ఓవర్లలో కేవలం 19 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. జేసన్ హోల్డర్‌కు రెండు వికెట్లు దక్కాయి.

### లక్ష్యాన్ని కరిగించిన గిల్, బట్లర్..

156 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కేవలం 18 బంతుల్లోనే 43 పరుగులతో బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి తోడుగా జోస్ బట్లర్ 19 బంతుల్లో 39 పరుగులు చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. చివర్లో రాహుల్ తెవాటియా 17 బంతుల్లో అజేయంగా 27 పరుగులు చేసి మరో 25 బంతులు మిగిలి ఉండగానే జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ నాలుగు ఓవర్లలో 28 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. రొమారియో షెపర్డ్ రెండు వికెట్లు దక్కించుకోగా.. సుయాష్ శర్మ ఒక వికెట్ తీశాడు. పరుగుల రక్షణలో బౌలర్లు శ్రమించినా.. బ్యాటర్లు చేసిన తప్పులతో బెంగళూరుకు పరాజయం తప్పలేదు.



## బుమ్రాపై పొలార్డ్ మద్దతు

**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ 2026లో ముంబై జట్టు ప్రధాన బౌలర్ బుమ్రా ప్రదర్శనపై వస్తున్న విమర్శలకు జట్టు బ్యాటింగ్ కోచ్ పొలార్డ్ బలమైన సమాధానం ఇచ్చారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా అధిక పరుగులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఆ మ్యాచ్‌లో బుమ్రా నాలుగు ఓవర్లలో అధిక పరుగులు ఇచ్చినా, దాన్ని పెద్దగా చూడాల్సిన అవసరం లేదని పొలార్డ్ అన్నారు. బుమ్రా ఏదైనా యంత్రం కాదని, అతడూ ఒక మనిషే కాబట్టి అప్పుడప్పుడు ఇలాంటి పరిస్థితులు రావడం సహజమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొంత ఫామ్ లోపం కనిపిస్తున్నా, త్వరలోనే తిరిగి తన అసలు స్థాయికి చేరుకుంటాడని నమ్మకం వ్యక్తం చేశారు. ఇన్నేళ్లుగా ముంబై జట్టుకు, భారత జట్టుకు బుమ్రా కీలక బౌలర్‌గా నిలిచాడని గుర్తు చేస్తూ, ఒక్క మ్యాచ్ ఆధారంగా అతడిని విమర్శించడం సరైంది కాదని తెలిపారు. జట్టు కోసం ఎన్నో విజయాలు అందించిన ఆటగాడికి మద్దతుగా నిలవాల్సిన సమయం ఇదేనని అన్నారు. మరోవైపు ఈ సీజన్‌లో ముంబై జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, ఇంకా అవకాశాలు పూర్తిగా ముగియలేదని పొలార్డ్ చెప్పారు. ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌లలో తక్కువ విజయాలు సాధించినా, మిగిలిన మ్యాచ్‌ల్లో గెలిచి ప్లే ఆఫ్స్‌కు చేరేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. జట్టు ఇంకా పోటీలోనే ఉందని, చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## రెండొందల పరుగులు సులభం ఎందుకు?



**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో మ్యాచ్‌లు భారీ స్కోర్ల వేదికగా మారాయి. దాదాపు ప్రతి మ్యాచ్‌లో రెండొందలకుపైగా పరుగులు నమోదు అవుతుండటంతో బౌలర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు స్పిన్ బౌలింగ్ కోచ్ ముత్తయ్య మురళీధరన్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ముప్పైసార్లకు పైగా రెండొందల స్కోర్లు నమోదవ్వడం, అలాగే భారీ లక్ష్యాలు కూడా సులభంగా ఛేదించబడటం గమనార్హమని ఆయన తెలిపారు. అయితే దీనికి బౌలర్లను తప్పుపట్టడం సరికాదని స్పష్టం చేశారు. ప్రధాన కారణం పిచ్‌లేనని పేర్కొన్నారు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌లు తయారు చేయడం వల్ల టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ వేగంగా పరుగులు సాధిస్తున్నారని అన్నారు. ఇక మైదానాల్లో బౌండరీ పరిమాణం చిన్నగా ఉండటం కూడా బౌలర్లకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. పిచ్‌ను బౌలర్లకు అనుకూలంగా మార్చితే మ్యాచ్‌లు నెమ్మదిగా సాగుతాయని, అది ప్రేక్షకులకు విసుగును కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రేక్షకులు ఎక్కువగా ఫోర్లు, సిక్సులు ఆశిస్తారని, అందుకే ఈ మార్పులు తీసుకొచ్చారని వివరించారు. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనతో అదనంగా ఒక బ్యాట్స్‌మన్ అవకాశం పొందడం వల్ల స్కోర్లు మరింత పెరుగుతున్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఐపీఎల్ కేవలం ఆట మాత్రమే కాకుండా పెద్ద వ్యాపారంగా మారిందని, ఇందులో స్పాన్సర్లు, వీక్షకుల సంఖ్య ఎంతో కీలకమని స్పష్టం చేశారు. మ్యాచ్‌లు ఆసక్తికరంగా లేకపోతే ప్రేక్షకులు చూడరని, అప్పుడు స్పాన్సర్లకు నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. అందుకే వినోదానికి ప్రాధాన్యం ఇస్తూ ఆటలో మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. క్రికెట్ అభివృద్ధి కంటే ప్రేక్షకులకు వినోదం అందించడం కూడా సమానంగా ముఖ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

## వైభవ్‌పై ముంబై కన్ను



**ముంబై, ఏప్రిల్ 30 :** ఐపీఎల్ 2026లో సంచలనంగా మారిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ పై ఇప్పుడు అన్ని జట్ల దృష్టి పడుతోంది. ముఖ్యంగా ముంబై ఇండియన్స్ వంటి దిగ్గజ జట్టు ఈ యువ ప్రతిభను తమ జట్టులోకి తీసుకురావాలనే ఆసక్తి చూపుతున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇంగ్లాండ్ మాజీ వేగవంత బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ వైభవ్ ఆటపై ప్రశంసలు కురిపించాడు. ప్రపంచ స్థాయి బౌలర్లను కూడా భయపడకుండా ఎదుర్కొంటూ అతను చూపుతున్న ధైర్యం, ప్రతిభ అసాధారణమని పేర్కొన్నాడు. ఇంత చిన్న వయసులోనే ఇలాంటి స్థాయిలో ఆడటం అరుదైన విషయం అని ఆయన అభిప్రాయపడ్డాడు. గతంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను తక్కువ ధరకు ఎంపిక చేసుకున్నప్పటికీ, ఇప్పుడు అతని ప్రదర్శన చూస్తుంటే భవిష్యత్తులో అతని విలువ భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మళ్లీ వేలంలోకి వస్తే అతని ధర ఎంతో ఎక్కువగా ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఆటగాళ్లను చాలా కాలం పాటు ఒకే జట్టులో ఉంచడం కష్టమైన విషయం. ఈ నేపథ్యంలో రాజస్థాన్ జట్టు వైభవ్‌ను కొనసాగించగలదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు యువ ఆటగాళ్లను గుర్తించి అవకాశాలు ఇచ్చే విషయంలో ముందుండే ముంబై జట్టు, ఈ ప్రతిభను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనతో ఐపీఎల్‌లో అతనిపై భారీ ఆసక్తి నెలకొంది. భవిష్యత్తులో అతను ఏ జట్టుకు ఆడతాడు అన్నది ఆసక్తికరంగా మారింది.



## మెడికల్ మాఫియా బాగోతంపై దూత-2

ఓటీటీ ప్రపంచంలో డార్క్, రియలిస్టిక్ కథనాలకు పెరుగుతున్న ఆదరణ మధ్య దూత సీజన్ 2పై ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. మొదటి సీజన్ జర్నలిజం బ్యాక్‌డ్రాప్‌లో సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా ఈ సిరీస్, ఇప్పుడు పూర్తిగా కొత్త జానర్ వైపు మలుపు తిరగడం హాట్ టాపిక్‌గా మారింది. ఈసారి మేకర్స్ మెడికల్ మాఫియా వంటి సున్నితమైన అంశాన్ని ఎంచుకోవడం విశేషం. ఆరోగ్య రంగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, మాఫియా నెట్వర్క్‌ను రియలిస్టిక్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. దీంతో సిరీస్ మరింత డార్క్, గ్రిప్పింగ్ నేరేషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉంది. ఈ మార్పు వెనుక ప్రధాన బలం దర్శకుడు విక్రమ్ కె. కుమార్ విజన్ అని చెప్పాలి. థ్రిల్లర్ కథనాల్లో తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్న ఆయన, సీజన్ 1లో జర్నలిజం ప్రపంచంలోని అంధకార కోణాలను చూపించినట్లే, ఈసారి మెడికల్ రంగంలోని లోపాలను షాకింగ్ ఎలిమెంట్స్‌తో తెరపైకి తీసుకురానున్నారు. ప్రస్తుతం ఓటిటి ప్లాట్‌ఫార్మ్‌లలో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్‌కు భారీ డిమాండ్ ఉంది. రియలిస్టిక్, డార్క్ కంటెంట్‌కు ప్రేక్షకులు ఎక్కువగా ఆకర్షితులవుతున్న నేపథ్యంలో, 'దూత 2' కూడా అదే ట్రెండ్‌ను క్యాష్ చేసుకునేలా రూపొం దుతోంది. 'దూత' మొదటి సీజన్ మంచి రెస్పాన్స్ అందు కోవడంతో, రెండో సీజన్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. ఈ సిరీస్‌లో ప్రధాన పాత్రలో నాగ చైతన్య నటించడం మరో ప్లస్ పాయింట్. ఆయన స్టార్ ఇమేజ్, కథలోని తీవ్రత కలిసి ప్రేక్షకులకు మరింత ఇంటెన్స్ అనుభూతిని అందించే అవకాశముంది.



## అగధలో మంజుల మనవరాలు జోవిక

ప్రముఖ సీనియర్ దర్శక నిర్మాత ఎమ్మెస్ రాజు ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న మిస్టికల్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. హారర్ జానర్‌లో రాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమా ద్వారా తమిళ నటి వనితా విజయ్ కుమార్ కుమార్తె,అలనాటి మంజుల మనవరాలు జోవిక విజయ్ కుమార్ టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. చిత్రంలో ఆమె 'హరిణి' అనే పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఆమెను ఒక తీవ్రమైన శక్తిగా అభివర్ణించారు మేకర్స్. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బాలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రావణ్ రెడ్డి 'సింహ'గా, కామాక్షి భాస్కర్ల 'మహాదేవి'గా నటిస్తుండగా, ఉల్కా గుప్తా, షిజు అబ్దుల్ రషీద్ వంటి తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు సుమారు 45 నిమిషాల పాటు సాగే భారీ వీఎఫ్ఎక్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతాన్ని అందిస్తుండగా, నాని చమిడిశెట్టి ఛాయాగ్రహణం, జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ మరియు రాజీవ్ నాయర్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.




## కందుల సులోచనగా అనుపమ

టాలీవుడ్ నటుడు శర్వానంద్ కథానాయకుడిగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' . ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా తాజాగా ఈ సినిమా నుంచి కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో అనుపమ కందుల సులోచనా రాణి అనే గ్రామీణ యువతిగా కనిపించబోతుంది. చేతిలో క్యారేజీ, మోదుగ ఆకులు పట్టుకుని ఉన్న పోస్టర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఈ సినిమా సాగబోతున్నట్లు సమాచారం. సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న ఈ హై-వోల్టేజ్ డ్రామాలో శర్వానంద్ ఊరమాస్ అవతారంలో కనిపిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరియు డింపుల్ హయాతీ ఫీమేల్ లీడ్స్ గా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 28, 2026 న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.




## దృశ్యం-3 టీజర్ విడుదల

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'దృశ్యం 3' టీజర్ ఎట్టకేలకు విడుదలైంది. బుధవారం సాయంత్రం విడుదలైన ఈ టీజర్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ వీడియోలో గత రెండు భాగాలకు సంబంధించిన కీలక ఘట్టాలను గుర్తు చేస్తూనే, మూడో భాగంపై భారీ అంచనాలను పెంచేశారు దర్శకుడు జీతూ జోసెఫ్. గతంలో తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి అత్యంత ధైర్యంగా, ప్రశాంతంగా ఎత్తుగడలు వేసిన జార్జ్ కుట్టీ, ఈసారి మాత్రం తీవ్రమైన భయంలో కనిపిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'ఇప్పుడు నాకు భయంగా ఉంది సార్.. నన్ను ఇంకెవరో గమనిస్తున్నారని అనిపిస్తోంది' అంటూ మోహన్‌లాల్ చెప్పే డైలాగ్ ఈసారి కథలో ఏదో పెద్ద ప్రమాదం పొంచి ఉందని సూచిస్తోంది. ఈ టీజర్‌లో మీనా, అన్సిబా, ఎస్తేర్ అనిల్ తో పాటు ఆశా శరత్ వంటి పాత పాత్రలన్నీ కనిపించి సందడి చేశాయి. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌లాల్ పుట్టినరోజైన మే 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఈ మూడవ భాగంతోనే సెన్సేషనల్ సిరీస్‌కు ముగింపు పలకనున్నట్లు తెలుస్తోంది. ఇక మలయాళ టీజర్ రావడంతో తెలుగులో విక్టరీ వెంకటేష్ నటించే రీమేక్ ఎప్పుడుంటుందా అని టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతానికి తెలుగు రీమేక్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ, మలయాళ వెర్షన్ విడుదలైన తర్వాత అక్కడ వచ్చే స్పందనను బట్టి రీమేక్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## ఓటీటీలోకి బైకర్ విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'బైకర్' ఓటీటీలోకి రాబోతుంది. భారతదేశంలోనే మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం మే 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది. ఇక హిందీలో ఈ సినిమాను 'శర్వా' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్ తన కెరీర్‌లో ఎదుర్కొనే సవాళ్లు, తండ్రి ఆశయాల కోసం అతను చేసే పోరాటాన్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. థియేటర్లలో మిశ్రమ స్పందన లభించినప్పటికీ, రేసింగ్ సీక్వెన్స్ మరియు టెక్నికల్ వాల్యూస్ పరంగా సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి.






## కల్కిలో నటించడం లేదు

రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్‌ల కాంబినేషన్‌లో వచ్చిన 'కల్కి 2898 ఏడీ' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఈ చిత్ర సీక్వెల్‌కు సంబంధించి గత కొద్దిరోజులుగా ఒక ఆసక్తికర వార్త నెట్టింట హల్చల్ చేస్తోంది. టాలీవుడ్ సీనియర్ నటుడు జేడీ చక్రవర్తి ఈ రెండో భాగంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతుంది. అయితే తాజాగా తన సినిమా 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో పాల్గొన్న ఆయన ఈ రూమర్లపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'కల్కి 2'లో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, ఇప్పటివరకు తాను ఎలాంటి షూటింగ్‌లోనూ పాల్గొనలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రచారాన్ని కేవలం సరదాగా ఎంజాయ్ చేశానని చెబుతూ, ఆ వార్తలకు జేడీ స్వస్తి పలికారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సీక్వెల్‌లో ప్రభాస్ భైరవ, కర్ణ పాత్రలతో పాటు మరో విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల పాత్రల నిడివి ఈసారి మరింత ఎక్కువగా ఉంటుందని సమాచారం.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com